కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రిక
కార్యాలయం నందు పని చేయుటకు
విలేఖరులు కావలెను.
సెల్: 9393949345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 271 విశాఖపట్నం, 13 ఆగస్టు 2023 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## కేజీహెచ్‌లో అభివృద్ధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేజీహెచ్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున శనివారం ఉదయం పరిశీలించారు. కేజీహెచ్‌లో అత్యవసర చికిత్స విభాగంలో ఆధునీకరణ పనులను, క్లినికల్ ల్యాబ్ ను మరియు ప్రధాన ద్వారం వద్ద నిర్మిస్తున్న ఆర్చ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ అత్యవసర చికిత్స విభాగం విస్తరణ పనులను రూ. 30 లక్షలతో చేపడుతున్నట్లు తెలిపారు. అదే విధంగా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా అత్యవసర క్లినికల్ ల్యాబ్ రూ.15 లక్షలతో ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు .

ఈ కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.శివానంద, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ చిత్రంతో రూ.100 నాణెం



విజయవాడ: నందమూరి తారకరామారావు శత జయంతిని పురస్కరించుకొని ఆయన గౌరవార్థం కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ చిత్రంతో రూ.100 నాణెం ముద్రించాలని నిర్ణయించినట్టు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి తెలిపారు. ఈ నిర్ణయంలో భాగంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ హైదరాబాద్‌లోని మింట్‌కు ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఎన్టీఆర్ బొమ్మతో వంద రూపాయల నాణెం ముద్రించి సిద్ధం చేశారని, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆవిష్కరిస్తారని తెలిపారు.

ఈనెల 28న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ కుటుంబ సభ్యులతో పాటు వందమందిని ఆహ్వానించారని పురంధేశ్వరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 50 శాతం వెండి, 40 శాతం రాగి, 5 శాతం నికెల్, 5 శాతం జింకుతో నాణెం తయారీ ఉండాలని కేంద్రం నిర్ణయించిన విషయం తెలిసిందే.

## తిరుమల నడక మార్గాల్లో మరింత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

అలిపిరి శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మరింత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టినట్లు టీటీడీ ఈవో ఏవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం టీటీడీ, అటవీ పోలీస్ అధికారులతో ఈవో అత్యవసర సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఈవో మీడియాతో మాట్లాడుతూ, తిరుమల నడకదారిలో చిన్నారిపై చిరుత దాడి చాలా బాధాకరమన్నారు. నడక మార్గంలో 500 సిసి కెమెరాలు ఏర్పాటు చెస్తామని చెప్పారు. నడక మార్గానికి ఇరువైపులా కంచె ఏర్పాటు చేసేందుకు సమగ్ర నివేదిక అందించాలని డి.ఎఫ్.ఓ ను ఆదేశించారు.

చిరుత దాడి ఘటనపై సిసిఎఫ్ నాగేశ్వరరావు అధ్వర్యంలో సీన్ రీకనస్ట్రక్షన్ చెయ్యించి, చిరుతను బంధించడం కోసం బోన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

నడకదారిలో ఇప్పటికే 30 మంది టీటీడీ భద్రత సిబ్బంది, 10 మంది ఫారెస్ట్ సిబ్బంది ఉన్నట్లు తెలిపారు. రెండు నడక మార్గాల్లో పారెస్టు, పోలీస్, టీటీడీ కలిసి మరింత ఎక్కువ మందితో పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.

100 మంది భక్తుల గుంపుకు సేక్యూరిటి సిబ్బందిని ఏర్పాటు చేసి అనుమతించనున్నట్లు చెప్పారు. నడకదారులలో మధ్యాహ్నం 2-3 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించే అంశాలపై సాధ్యా సాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా వుండేందుకు, త్వరలో అటవీ శాఖ అధికారులు అందించే నివేదిక ఆధారంగా పటిష్టమైన భద్రత చర్యలు చేపడతామని ఆయన వివరించారు.

చిన్నపిల్లలతో నడక మార్గాల్లో వచ్చే తల్లితండ్రులు వారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

సిసిఎఫ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, ట్రాంక్విలైజర్స్, బోన్లు వినియోగించి నడక మార్గాల్లో సంచరించే వన్య మృగాలను బంధించనున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సమావేశంలో ఎస్ ఈ -2 జగదీశ్వర్ రెడ్డి, తిరుమల ఏఎస్ పి ముని రామయ్య, డిఇ ఎలక్ట్రికల్ రవి శంకర్ రెడ్డి, డిఎఫ్ఓ శ్రీనివాసులు, విజివోలు

(మిగతా 2లో)

## తితిదే మరిన్ని రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఆ ఘోరం తప్పేది



**తిరుమల:** తిరుమలలో చిరుత దాడిలో ఆరేళ్ల బాలిక మృతి చెందడంపై తెదేపా అధినేత చంద్రబాబు స్పందించారు. అలిపిరి కాలినడక మార్గంలో చిన్నారి లక్షిత మృతి అత్యంత విషాదకరమని ఆయన విచారం వ్యక్తం చేశారు. కళ్ల ముందే కుమార్తెను క్రూర జంతువు లాక్కెళ్తే ఆ బాధ వర్ణనాతీతమని తెలిపారు. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొద్దిరోజుల క్రితం చిరుత దాడిలో బాలుడు సైతం గాయపడ్డాడని చంద్రబాబు గుర్తుచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) మరిన్ని రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఈ ఘోరం తప్పేదన్నారు.

బాలికపై చిరుత దాడి చాలా

(మిగతా 2లో)

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు



దేశంలోని చాలా ప్రాంతాల్లో ఒక వారం రోజుల పాటు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న కొద్ది రోజుల పాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంది. గుజరాత్, విదర్భ, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. బెంగాల్, ఒడిశా, తెలంగాణ, కొంకణ్, గోవా, కోస్టల్ కర్ణాటక, అండమాన్, నికోబార్ దీవులు, లక్షద్వీప్‌లలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇక తెలుగు రాష్ట్రాల విషయానికి వస్తే.. శనివారం ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సగటు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తన ద్రోణి ఏర్పడి ఉంది. ఈ తుఫాను పశ్చిమ మధ్య బంగాళా ఖాతంలో ఆంధ్రప్రదేశ్ తీరానికి ఆనుకుని ఉంది. దీనికి అదనంగా, సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో ద్రోణి అంతర్గత కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు ఏపీలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. కోనసీమ, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఇక వాతావరణ శాఖ తాజా అంచనాల ప్రకారం. ఆగస్టు 15 నుంచి ఉత్తరాంధ్ర, తెలంగాణలో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాయలసీమలో మాత్రం వాతావరణం పొడిగానే ఉంటుందని, అక్కడక్కడా మాత్రమే చిరుజల్లులు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. రాబోవు మూడు రోజులకు ఏపీలో వాతావరణం ఎలా ఉండబోతుందో

(మిగతా 2లో)

## వైసీపీ సమాంతర వ్యవస్థ శాంతిభద్రతలకు విఘాతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బంగారు ఆభరణాల కోసం ఒంటరి వృద్ధురాలిని వాలంటీర్ అతి కిరాతకంగా హత్య చేసిన ఘటన గురించి తెలుసుకొంటే బాధ ఆగలేదు. ముఖంపై పిడిగుద్దులు గుద్ది, పీక నులిమి అత్యంత భయానకంగా హత్య చేశాడు. ఆమె నివసిస్తున్న ప్రాంతానికి దగ్గరలోనే ఉన్నా మా అమ్మను కాపాడుకోలేక పోయామని వృద్ధురాలి కొడుకు పడుతున్న ఆవేదన చూసి కడుపు తరుక్కుపోతోంది. హత్య జరిగి పది రోజులు కావొస్తున్న ఇప్పటి వరకూ ప్రభుత్వం నుంచి ఒక్క నాయకుడు కూడా పరామర్శకు రాలేదు అంటే వాళ్ల ఆలోచన విధానం ఏంటో అర్థమవుతోంద'ని జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ అన్నారు. పెందుర్తి సుజాతనగర్‌లో ఇటీవల వాలంటీర్ చేతిలో హత్యకు గురైనకోటగిరి వరలక్ష్మి కుటుంబాన్ని పవన్ కళ్యాణ్ శనివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ , పార్టీ నేతలు ఈ పరామర్శలో పాల్గొన్నారు.

అనంతరం మీడియాతో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తమ నవరత్నాల కోసం నియమించిన వాలంటీర్ వ్యవస్థ ఈ రోజు ప్రజల ప్రాణాలు తీస్తోంది. కొంతమంది వాలంటీర్లు అసాంఘిక శక్తులుగా మారి నేరాలకు తెగబడుతున్నారు. వాళ్లు చేస్తున్న దురాగతాలు కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయి. బయటకు రాని నేరాలు చాలానే ఉన్నాయి. పాస్ పోర్టు కావాలన్నా, చిన్నపాటి ఉద్యోగానికైనా పోలీస్ వెరిఫికేషన్ చేస్తారు. వాలంటీర్ అనే ఈ సమాంతరం వ్యవస్థలో ఉద్యోగాలు ఇస్తున్నప్పుడు ఎందుకు పోలీస్ వెరిఫికేషన్ చేయడం లేదు? వైసీపీ తన కోసం వినియోగించుకునే వ్యవస్థను నిబంధనలు గాలికొదిలి తయారు చేస్తోంది.

ఇళ్లలోకి చొరబడి

(మిగతా 2లో)

## 'జీవన్ దాన్' ఆధ్వర్యంలో అవయవదాన దినోత్సవ వేడుకలు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):**జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా జీవన్ దాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రం నందు అవయవ దాన దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని జీవన్ దాన్, రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ కె. రాంబాబు తెలిపారు.

ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విశాఖపట్నం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున విచ్చేయనున్నారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా అవయవ దానం చేసిన వారి కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించనున్నారు.

## ఎపి జిఇయుఎస్‌సి వైస్ చైర్మన్‌గా ఎయు ఉద్యోగి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సమైక్య రాష్ట్ర కమిటీ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ కల్యాణ మండపం గుంటూరులో 12 ఆగస్టు 23న జరిగినవి.

ఈ ఎన్నికల్లో విశాఖపట్నానికి చెందిన ఆంధ్ర యూనివర్సిటీ ఉద్యోగి షేక్ ఖాదర్ బాబా వైస్ చైర్మన్‌గా ఎన్నిక కాబడ్డారు. ప్రస్తుతం ఆయన ఆంధ్ర యూనివర్సిటీ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా మరియు ఉపాధ్యక్షునిగా ఉన్నారు. ఆయన ఎన్నిక పట్ల యూనివర్సిటీ ఉద్యోగ మిత్రులు, ఏపీ జిఎఫ్ విశాఖపట్నం కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అయినటువంటి జెఎం నాయుడు, సుదర్శన్ పట్నాయక్, కో కన్వీనర్ డాక్టర్ నరేంద్ర కుమార్ శుభాభినందనలు తెలియజేశారు.

## ఆర్‌ఎంపీ వైద్యులకు ఆయుర్వేద అవగాహన



ఉత్తరాంధ్ర జిల్లాలలోని ఆర్‌ఎంపీ, పీఎంపీ, ఎల్‌ఎల్‌ఎం వంటి ప్రైవేట్ గ్రామీణ వైద్యులకు ఆయుర్వేద వైద్యంలోని కొన్ని ప్రధాన అంశాలపై అవగాహన కల్పించేందుకు, చర్చించేందుకు ఈనెల 13వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు విశాఖ నగరంలోని విశాఖ సమాచారమ్ దినపత్రిక కార్యాలయం మొదటి అంతస్థులో గల సమావేశ మందిరంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు గంగోత్రి హెర్బల్స్ మేనేజింగ్ డైరెక్టర్ శర్మ ఎస్. ఆకెళ్ల, ఆ సంస్థ విశాఖ నగర ప్రతినిధి కొప్పల రామ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

మధుమేహ రోగులు, నిరంతరం జలుబుతోనూ, ఊపిరితిత్తుల సమస్యలతోనూ బాధపడేవారికి ఖచ్చితమైన వైద్యం ఎలా చేయాలో, ఎటువంటి మందులు వినియోగించాలో తెలియజేసేందుకు, ఆర్‌ఎంపీ వైద్యుల సందేహాలకు విస్తృతమైన సమాధానాలు ఇచ్చేందుకు ప్రఖ్యాత ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సుధీర్ జోషి ఈ కార్యక్రమంలో పాల్గొంటారని రామ్‌కుమార్ తెలియజేశారు. నగరంలోని, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేద వైద్యం పట్ల ఆసక్తి కలిగిన వారు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునేవారు 9393949345 నెంబరుకు వాట్సాప్ ద్వారా తమ వివరాలు ముందుగా పంపితే అవకాశం కల్పిస్తామని వారు తెలిపారు.

(మొదటి పేజీ తరువాయిలు)

### తిరుమల నడక మార్గాల్లో మరింత పటిష్టమైన భద్రత ఏర్పాట్లు

బాల్ రెడ్డి, గిరిధర్, మనోహర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### తితిదే మరిన్ని రక్షణ చర్యలు చేపట్టి ఉంటే ఆ ఘోరం తప్పేది

దురదృష్టకర ఘటన అని భాజపా నేత భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బాలిక మృతికి భద్రతా వైఫల్యమే కారణమన్నారు. " జంతువులు దాడి చేసే ప్రదేశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని కదా? అదనపు భద్రత ఏర్పాటు చేయవచ్చు కదా?" అని ప్రశ్నించారు.

## తెలుగు రాష్ట్రాల్లో మళ్లీ వర్షాలు

అమరావతి వాతావరణ శాఖ వివరాలు వెల్లడించింది. ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ మరియు యానాంలలో ఈరోజు, రేపు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణముకంటె 3 నుండి 5 డిగ్రీల సెంటీగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముంది. ఒకటి రెండు చోట్ల వేడి, తేమ అసౌకర్య వాతావరణం ఉంటుందని చెప్పారు. బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగం వీచే అవకాశముందన్నారు.

ఇక ఎల్లుండి నుండి తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. గాలితో వేడి, తేమ, అసౌకర్య వాతావరణం ఉంటుందన్నారు. బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగముతో వీచే అవకాశముంది

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్ : ఈరోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉందన్నారు. ఒకటి రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటె 3 నుండి 5 డిగ్రీల సెంటీగ్రేడ్ అధికంగా ఉంటాయన్నారు. వేడి, తేమ, అసౌకర్య వాతావరణము ఒకటి, రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉంది. బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముంది.

ఇక రేపు, తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. ఉరుములతో కూడిన మెరుపులు, ఒకటి రెండు చోట్ల కురిసే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటె 3 నుండి 5 డిగ్రీల సెంటీగ్రేడ్ అధికంగా నమోదయ్యే అవకాశముంది. వేడి,తేమ అసౌకర్య వాతావరణం ఒకటి రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉంది. బలమైన గాలులు గంటకు 30-40 కిలోమీటర్ల వేగం వీచే అవకాశముంది.

ఎల్లుండి తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు ఒకటి, రెండు చోట్ల కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో వేడి, తేమ, అసౌకర్య వాతావరణం ఉంటుంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముంది.

అటు రాయలసీమలోనూ ఈ రోజు తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. లేదంటే ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశం ఉంది. ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశ ఉంది. రేపు, ఎల్లుండి కూడా తేలిక పాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందన్నారు.

### వైసీపీ సమాంతర వ్యవస్థ శాంతిభద్రతలకు విఘాతం

మరీ సమాచారం సేకరిస్తున్న వాలంటీర్లు అసలు ఎలాంటి వారో కూడా చూడకుండానే వారిని నియమించడం. ఎంత వరకు సబబు? వాలంటీర్ల ముసుగులో కొందరు చేస్తున్న దురాగతాలు రోజుకొకటిగా వెలుగు చూస్తున్నాయి. వీరిపై పర్యవేక్షణ లేకపోవడంతో, క్షేత్రస్థాయిలో వారు రెచ్చిపోతున్నారు. ఇదొక దండుపాళ్యం బ్యాచ్‌లా తయారైంది.

## పేదల డబుల్ బెడ్రూం ఇళ్లపై సెప్టెంబరు 4న విశ్వరూప ధర్నా: కిషన్ రెడ్డి




తెలంగాణలోని పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వాలన్న డిమాండ్‌తో బీఆర్ఎస్ సర్కారుపై ఉద్యమ స్థాయిలో పోరాడాలని బీజేపీ నిర్ణయించుకుందని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఉద్యమ కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు.

వచ్చే నెల 4వ తేదీన హైదరాబాద్ లో విశ్వరూప ధర్నా చేపడుతున్నామని ప్రకటించారు. ఈ నెల 16, 17 తేదీల్లో బస్తీల్లో సమస్యలపై బస్తీల బాట కార్యక్రమం ఉంటుందని, ఈ నెల 18న మండల కేంద్రాల్లో ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లా కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని వివరించారు.

కేసీఆర్ ది రజాకార్ల ప్రభుత్వమని కిషన్ రెడ్డి విమర్శించారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందాలంటే బీజేపీ సర్కారు రావాలని స్పష్టం చేశారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలంటూ బీజేపీ ఇవాళ హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమం చేపట్టింది. ఈ ధర్నాలో కిషన్ రెడ్డి కూడా పాల్గొన్నారు.

# శ్రామిక మహిళల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శ్రామిక మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు, అంగన్‌వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి డిమాండ్ చేసారు. ఈ రోజు 12-08-2023 (శనివారం) మధ్యాహ్నం డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో సిఐటియు శ్రామిక మహిళా విశాఖ జిల్లా సదస్సు ఎల్ఐసి యూనియన్ నాయకులు సూర్యప్రభగారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య వ్యక్తగా హాజరైన బేబిరాణి గారు మాట్లాడుతూ శ్రామిక మహిళలు ఎంతో శ్రమకోర్చి తమ కుటుంబాలకు పోషించడం కోసం పనిచేస్తువుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై రోజురోజుకి పని భారాలు మోపుతూ వారి ఏ విధమైన కార్మిక చట్టాలు అమలు చేయకుండా అత్యంత తక్కువ వేతనాలతో వారి శ్రమను దోచుకుంటుందన్నారు. ఆకాశంలో సగం జనాభాలో సగంగా వున్న మహిళలు అన్ని విభాగాల్లో ముందుకు దూసుకు వెళ్ళుతున్నారన్నారు. పేదవారికి సహాయం అందిస్తున్నటువంటి అనేక స్కీమ్స్‌లో మహిళ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. మహిళలు కుటుంబంలోను, పని ప్రదేశంలోను, సమాజంలోను అన్నివైపుల వివక్షతకు గురౌతున్నారన్నారు. మహిళ యొక్క ప్రత్యేకమై సమస్యలను చర్చించేందుకు ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

కేంద్రంలో బిజెపి అధికారంలోనికి వచ్చిన తరువాత మహిళల పట్ల అతి కిరాతంగా వ్యవహరిస్తుదని, మహిళ హక్కులను కాలరాస్తుందన్నారు. మహిళలను వంట ఇంటికే పరిమితం చేయాలనే మనుధర్మశాస్త్రాన్ని బిజెపి అమలు చేస్తుందన్నారు. మహిళలకు రాత్రివేళల్లో డ్యూటీలు వేయకూడదని చట్టాలున్నా అది అమలు చేయటం లేదన్నారు. మహిళ కార్మికులు పనిచేస్తున్న చోట లైగింక వేధింపుల నిరోధిక కమిటీలను అన్ని చోట్ల ఏర్పాటు చేయాలసివుందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా రెస్ట్‌రూమ్స్, క్రెచ్‌లు ఏర్పాటు చేయాలి. అలాగే ప్రశూతి సెలవులు కల్పించ వలసివుండగా చాలా ప్రైవేటు యాజమాన్యాలు వీటిని అమలు చేయటం లేదన్నారు. మహిళలే అత్యధికంగా పనిచేస్తున్న బ్యాండెక్స్, ఎస్ఇజెడ్‌లో వారితో వెట్టిచాకిరి చేయించుకుంటూ వారిని అనేక వేధింపులకు గురిచేస్తుందన్నారు. ఇటువంటి సమస్యలపై శ్రామిక మహిళా సదస్సులో చర్చించి వాటి పరిష్కారం కోసం కార్యా చరణ రూపొందిస్తామన్నారు.

ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, కార్యదర్శి పి.మణి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తులసి, దేవి, ఆశా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, మేరీ, మిడ్డేమీల్స్ యూనియన్ కార్యదర్శి మంగశ్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు అనసూయ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి బి.రత్నం, ఎల్.ఐ.సి. డివిజన్ అధ్యక్షులు ఎం.కామేశ్వరి ఆర్.పి. యూనియన్ అధ్యక్షలు అలివేణి మరియు హాస్పిటల్స్, షాప్స్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, ఇంటిపనివారు తదితర సంఘాల నుండి శ్రామిక మహిళ నాయకులు హాజరయ్యారు.

# పాత పెన్షన్ విధానం అమలు చేయాలి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎఫ్ ఏ పి టి ఓ రాష్ట్ర కమిటీ మేరకు స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద ఎఫ్ఏపిటిఓ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 12 గంటల ధర్నా కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ పాల్గొని ధర్నానుద్దేశించి మాట్లాడారు. ధర్నాకు తన సంఘీభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 117 జీవోను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు పాఠశాలలో ఉపాధ్యాయులను తగ్గించి ఏకో పాధ్యాయ పాఠశాలలుగా నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. తక్షణం ప్రభుత్వం తమ విధానాలను మార్చుకోవాలని ఆయన అన్నారు ఈకార్యక్రమంలో ఎన్.వి.సూర్యనారాయణ, నాగిరెడ్డి సన్యాసి నాయుడు, తమరణ త్రినాథ, గుండి చిన్నబ్బాయి, సుధాకర్, ఎం.ఎం.నాయుడు, కెవిఎల్ గణేష్, నూకేష్, దుర్గాప్రసాద్, బాలు మరియు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్‌లోనే ఆర్టీసీ బస్సుల ట్రాకింగ్: గమ్యం యాప్ వచ్చేసింది, మహిళల భద్రతకు ప్రత్యేకం




హైదరాబాద్: ప్రజా రవాణాను మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (TSRTC) సరికొత్త బస్ ట్రాకింగ్ యాప్ 'గమ్యం'ను తీసుకొచ్చింది. అత్యాధునిక ఫీచర్లతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ యాప్ ను ఎంజీబీఎస్ బస్టాండ్‌లో సంస్థ ఎండీ సజ్జనార్ ప్రారంభించారు. యాప్ సంబంధించిన లోగోను ఆవిష్కరించారు. ఆర్టీసీకి చెందిన 4170 బస్సులకు ఈ ట్రాకింగ్ సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు.

అనంతరం సజ్జనార్ మాట్లాడుతూ ముందుగా టీఎస్ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో వీలినం చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కి ధన్యవాదాలు చెబుతూ టీఎస్ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కి కూడా సంస్థ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ గొప్ప నిర్ణయాన్ని సంస్థ స్వాగతిస్తూ రెట్టించిన ఉత్సాహంతో ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలమనే విశ్వాసం తనకుందన్నారు.

రెండేళ్లుగా ప్రజలకు ప్రజా రవాణా వ్యవస్థను దగ్గర చేసేందుకు ఎన్నో విప్లవాత్మక మార్పులకు టీఎస్ఆర్టీసీ యాజమాన్యం శ్రీకారం చుట్టిందని, ప్రతి రోజు 45 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్న సంస్థ మార్కెట్ లోని పోటీని దీటుగా ఎదుర్కొనేందుకు ఈ మధ్యకాలంలో అత్యాధునిక హంగులతో కూడిన 776 కొత్త బస్సులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు.

ఇక, గమ్యం యాప్ ప్రయోజనాలను వివరిస్తూ అరచేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే టీఎస్ఆర్టీసీ బస్సుల సమాచారన్నంతా తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు. ఇకపై బస్సు ఎక్కడుందో, ఎప్పుడొస్తుందో అని వేచిచూడాల్సిన అవసరం లేదని, అత్యాధునిక ఫీచర్లు గల 'గమ్యం' యాప్ తో ఆర్టీసీ బస్సు మన వద్దకు రావడానికి ఎంత సమయం పడుతుందో తెలుసుకోవచ్చని సజ్జనార్ స్పష్టం చేశారు.

'ప్రస్తుతం టీఎస్ఆర్టీసీకి చెందిన 4,170 బస్సులకు ట్రాకింగ్ సదుపాయం కల్పించాం. హైదరాబాద్‌లోని పుష్పక్ ఎయిర్ పోర్ట్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. అదే విధంగా జిల్లాల్లో పల్లె వెలుగు మినహా అన్ని బస్సులకు ఈ సదుపాయం కల్పించబడింది. అక్టోబర్ నెల నుంచి మిగతా సర్వీసులన్నింటికీ ట్రాకింగ్ సదుపాయాన్ని అనుసంధానం చేయబోతున్నాం' అని సజ్జనార్ తెలిపారు.

'గమ్యం' యాప్ ద్వారా ఆరంభ స్థానం నుంచి గమ్యస్థానం వరకు ఏఏ బస్సులు ఏఏ సమయాల్లో అందుబాటులో ఉన్నాయో తెలుసుకోవచ్చు. డ్రైవర్, కండక్టర్ వివరాలు అందులో కనిపిస్తాయి. సిటీ బస్సులకు రూట్ నంబర్ ఎంటర్ చేసి బస్సు ఎక్కడుందో పసిగట్టొచ్చు. దూరప్రాంత సర్వీసులకు రిజర్వేషన్ నంబర్ ఆధారంగా బస్సులను ట్రాకింగ్ చేయొచ్చు. ఈ యాప్ ద్వారా సమీపంలోని బస్టాప్‌లను తెలుసుకోవచ్చు. ఆ సమాచారంతో జర్నీని ప్లాన్ చేసుకోవచ్చు అని టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఐపీఎస్ తెలిపారు.

'మహిళా భద్రతకు 'ఫ్లాగ్ ఏ బస్' ఫీచర్ మహిళా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేస్తోన్న టీఎస్ఆర్టీసీ వారి సౌకర్యార్థం గమ్యం యాప్‌లో 'ఫ్లాగ్ ఏ బస్' అనే సరికొత్త ఫీచర్ ను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాత్రి వేళల్లో బస్టాప్ లు లేని ప్రాంతాల్లో ఈ ఫీచర్ మహిళా ప్రయాణికులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది.

రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు ఫ్లాగ్ ఏ బస్ ఫీచర్ బస్ అందుబాటులో ఉంటుంది. యాప్‌లో వివరాలు నమోదు చేయగానే తమ స్మార్ట్ ఫోన్‌లో స్క్రీన్‌పై ఆటోమేటిక్ గా గ్రీన్ లైట్ ప్రత్యక్షం అవుతుంది. ఆ లైట్‌ను డ్రైవర్ వైపునకు చూపించగానే సంబంధిత డ్రైవర్ బస్సును ఆపుతారు. దీంతో మహిళలు క్షేమంగా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు.

అలాగే, అత్యవసర పరిస్థితుల్లో ఎస్ఓఎస్ బటన్ ద్వారా టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించే సదుపాయం ఉంది. డయల్ 100, 108కి కూడా ఈ యాప్ ను అనుసంధానం చేయడం జరిగింది. ఈ సదుపాయంతో యాప్ నుంచే నేరుగా పోలీసులకు సమాచారం ఇవ్వవచ్చు. బస్సు బ్రేక్ డౌన్, వైద్య సహాయం, రోడ్డు ప్రమాదం, తదితర వివరాలను ఈ యాప్ ద్వారా ప్రయాణికులు రిపోర్టు చేయొచ్చు. ఆ వివరాల ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

యాప్‌ను డౌన్లోడ్ చేసుకోండిలా! 'TSRTC Gamyam' పేరుతో ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్లో అందుబాటులో ఉంది. టీఎస్ఆర్టీసీ అధికారిక వెబ్సైట్ http://tsrtc. telangana. gov.in నుంచి ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఉచితంగా యాప్‌ను ఇన్ స్టాల్ చేసుకోవచ్చు. ఈ యాప్లో ప్రయాణికులు ఎలాంటి వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరం లేదు. తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ఈ యాప్ అందుబాటులో ఉంది. గమ్యం యాప్‌ను ప్రజలందరూ తమ స్మార్ట్ ఫోన్ లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఇప్పటికే ఇన్‌స్టాల్ చేసుకుంటే అప్ డేట్ చేసుకోవడం తప్పనిసరి. టీఎస్ఆర్టీసీ తీసుకువచ్చిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలందరూ ఆదరించి, ప్రోత్సహించారు. సరికొత్త ఫీచర్లతో అందుబాటులోకి తీసుకువచ్చిన ఈ యాప్‌ను అలానే ఆదరించాలని సంస్థ కోరుతోంది. ఈ యాప్ పై ఫీడ్ బ్యాక్‌ను ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తోంది.

**పంచాంగం**

ఆదివారం 13-08-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
అధిక శ్రావణ మాసం

తిథి : బ. ద్వాదశి ఉ. 08.37
నక్షత్రం : ఆరుద్ర ఉ. 10.02
వర్జ్యం : రా. 11.01 ల 12.43

## నిర్మలమ్మను ఆహ్వానించిన వంగా గీత



ఢిల్లీ: కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి వర్యులు నిర్మలా సీతారామన్‌ని కలసి IIFT కాకినాడలో (ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్) అకాడమిక్ కోర్సెస్ ప్రారంబిచడమే కాకుండా భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన నందుకు ధన్యవాదములు తెలియచేస్తూ త్వరలోనే జరగబోయే శంకుస్థాపన కార్ర్యమానికి రావాలని కోరారు ఎం.పి. వంగా గీత. అన్నవరం ప్రసాద్ స్కీమ్‌కు ఆర్థిక శాఖ నుండి నిధులు మంజూరు చేయాలి అని కోరగా మంత్రి సానుకులంగా స్పందించారు.

## మీ ఆధార్ నెంబర్‌తో ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో మీకు తెలుసా?



హైదరాబాద్: సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ వ్యవహారాలు నడిపే వారంతా ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఏర్పడింది. కొత్త కొత్త సాంకేతికతతో ఆన్‌లైన్ వ్యవహారాలు జరిపే వారిని దోచేస్తున్నారు సైబర్ నేరగాళ్లు. వ్యక్తిగత వివరాలను సేకరించి మన పేరుతోనే మన ఖాతాల్లోని డబ్బులను కాజేస్తున్నారు.

మన ఆధార్ నెంబర్‌తో సిమ్ కార్డ్ యాక్టివేట్ చేసుకుని ఈ నేరగాళ్ల మోసాలకు పాల్పడే అవకాశం కూడా లేకపోలేదు. ఇటీవల విజయవాడలోని ఓ వ్యక్తి ఆధార్ కార్డుతో ఏకంగా 658 సిమ్ కార్డులు యాక్టివేట్ అయి ఉండటం గమనార్హం. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో దాన్ని గుర్తించిన టెలికాం అధికారులు వాటన్నింటినీ బ్లాక్ చేశారు. ఇలా ఇతర ప్రాంతాల్లోనూ జరుగుతున్నాయి.

ఈ నేపథ్యంలోనే టెలికాం శాఖ కొత్త నిబంధనలను రూపొందించింది. ఒక ఆధార్ కార్డుతో గరిష్టంగా 9 సిమ్ కార్డులు తీసుకునేందుకు మాత్రమే అనుమతించింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఎక్కువ సిమ్ కార్డులు తీసుకోవాల్సి వస్తే రీ-వెరిఫికేషన్ తప్పనిసరి చేసింది. ఈ అవకాశాన్ని కూడా దుర్వినియోగం చేసే అవకాశం ఉండటంతో మరో ప్రత్యేక ఏర్పాటును చేసింది.

ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డు పేరిట ఎన్ని సిమ్ కార్డులు ఉన్నాయో తెలుసుకునేలా డిపార్ట్ మెంట్ ఆఫ్ టెలికాం ఒక వైబ్‌సైట్‌ను కూడా రూపొందించింది. దీని ద్వారా ఆధార్ కార్డుతో ఎన్ని మొబైల్ నెంబర్లు అనుసంధానమై ఉన్నాయో చెప్పడమే కాకుండా.. మొబైల్‌ను ఎవరైనా చోరీ చేసినా.. పోగొట్టుకున్నా దాన్ని బ్లాక్ చేసుకునేలా అవకాశం కల్పించారు.

మొదట https://www.sancharsaathi.gov.in/ వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. అందులో 'బ్లాక్ యువర్ లాస్ట్/స్టోలెన్ మొబైల్',know your mobile connection (https://tafcop.sancharsaathi.gov.in/telecomUser/) అనే రెండు ఆప్షన్లు కనిపిస్తాయి.

రెండో ట్యాబ్‌పై క్లిక్ చేస్తే వినియోగదారుడి 10 అంకెల మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేయాలని అడుగుతుంది.

ఆ తర్వాత మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీ (OTP) ఎంటర్ చేస్తే ఆ యూజర్ పేరిట ఉన్న మొబైల్ నెంబర్ల జాబితా చూపిస్తుంది.

ఇందులో ఏదైనా నెంబర్ మీది కాకపోయినా ప్రస్తుతం వినియోగించకపోయినా దాన్ని బ్లాక్ చేసుకునే ఆప్షన్ ఇచ్చారు. వినియోగదారులు వెంటనే ఈ సదుపాయాన్ని వినియోగించి తమ ఆధార్‌పై ఉన్న సిమ్ కార్డుల వివరాలను తెలుసుకోవచ్చు.

## పోలీసులపై దాడి చేస్తే సహించేదిలేదు

ఇటీవల పుంగనూరులో జరిగిన పరిణామాల నేపథ్యంలో ఏపీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పుంగనూరులో పోలీసులపై అల్లరి మూకలు దాడులకు పాల్పడ్డాయని, ఇలాంటి దాడులను పోలీస్ శాఖ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని స్పష్టం చేశారు. ఎవరైనా సరే శాంతిభద్రతలను దెబ్బతీసే విధంగా ప్రకటనలు చేసినా, పోలీసులపై దాడి చేసినా తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాగా, పుంగనూరులో పోలీసులపై దాడి చేసిన ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, పుంగనూరు దాడి ఘటనలో పాల్గొంది బయటి వ్యక్తులా? స్థానికులా? అనే దానిపై నిశితంగా విచారణ జరుపుతున్నట్టు డీజీపీ వెల్లడించారు.

ఈ కేసులో ఇప్పటివరకు 80 మందిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. పోలీసు డిపార్ట్ మెంట్ అందరి కోసం పనిచేస్తుందన్న విషయాన్ని రాజకీయ పార్టీలు గ్రహించాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాజకీయ పార్టీలు తమకు సహకరించాలని అన్నారు.

విశాఖ సమాచారమ్

ఆదివారం 13-08-2023

# సనాతన హైందవ ధర్మాలు

మహా భారత రచయిత శ్రీ వేద వ్యాస మహర్షి చేసిన కొన్ని అద్భుత ప్రయోగాలు

1. కేవలం నీటి నుంచి సంతాన ఉత్పత్తి : భీష్ముడు జననం.

2. నేతి కుండలలో పిండాల అభివృద్ధి : ఇప్పటి టెస్ట్ ట్యూబ్ బేబీల జననాలు 100 మంది కౌరవులు ఏక కాల సంవత్సరంలో జననం.

3. పంచ భూతాలు నుంచి, అంటే గాలి, నేల, నీరు, నిప్పు, ఆకాశం నుంచి జననం.

పంచ భూతాలు కుంతితో పాండవుల జననం.

4. ఆచార్య ద్రోణుడు, భరద్వాజ మహర్షి : టెస్ట్ ట్యూబ్ బేబీలు, కృపాచార్యుడు, కృపి అనే అన్నా చెల్లెళ్ళు కూడా టెస్ట్ ట్యూబ్ బేబీలే, కానీ ఈ ఇద్దరి టెస్ట్ ట్యూబ్ పిల్లలకి పెళ్లి చేసి తద్వారా మామూలు కలయిక ద్వారా పిల్లలను కనవచ్చా లేదా అన్నది ప్రాక్టికల్‌గా ప్రయోగం చేశారు తద్వారా అశ్వత్థామ జననం.

5. ఒక మనిషి , సూర్యునిలో ఉన్న తేజస్సుని గ్రహించి సూపర్ నాచురల్ ప్రొటెక్షన్‌తో బిడ్డకు జన్మనివ్వటం : సూర్యుడు కుంతితో కర్ణుని జననం.

6. అగ్ని నుంచి వచ్చే తేజస్సుతో పిల్లలను కనటం : ద్రౌపది, దుష్టద్యుమ్నుల జననం.

7. సాధారణ మానవునికి, ఒక అసాధారణ వనితకి వివాహం :భీముడు హిడింబిలకు ఘటోత్కచుడి జననం.

8. ఆడదాన్ని మగ వాడిగా మార్చటం- శిఖండి

9. మగ వాడిని ఆడదానిగా మార్చటం - చిత్ర రధుడు.

10. చేప కడుపున ఆడపిల్ల పుట్టటం : సత్యవతి.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఎన్నెన్నో ఉన్నాయి. కేవలం ఒక్క మహా భారత గ్రంథంలోనే ఇన్ని ఉంటే, మన రామాయణ, భాగవతాలు, అష్టా దశ పురాణాలు, వేదాలు ఉపనిషత్తులలో ఇంకెన్ని రహస్యాలు, ఇంకెంత విజ్ఞానం దాగి ఉందో?

ఇవేమి, నేటి సైన్స్‌కి అర్థం కాని ప్రశ్నలు. కానీ ఇలాంటి ప్రయోగాలు ఇప్పుడు సాధ్యం కాకపోయినా లక్షల సంవత్సరాల క్రితమే మన భారతీయ ఋషులు ఈ ప్రయోగాలు ఎలా చేయ గలిగి విజయం సాధించ గలిగారు?

ఇప్పటి మిడి మిడి జ్ఞానం ఉన్న మనలో కొంత మంది ఫేక్ అని కొట్టి పడేస్తారు. కానీ లక్షల సంవత్సరాల క్రితం ఆ ఊహ గొప్పదే కదా?

ఈ సనాతన హైందవ ధర్మం ఒక అంతులేని సైన్స్. అందులో పరిశోధన చేసే కొద్దీ అద్భుతాలు ఎన్నో బైటికి వస్తాయి అని, స్వామి వివేకానంద ఎప్పుడో చెప్పారు.

కాబట్టి మనం పూజించే ప్రతి దైవం సైన్స్‌కి ప్రతి రూపము. సైన్స్ ఉంది అంటే, ఖచ్చితంగా దాని existency ఉండి తీరుతుంది.

ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత పుణ్య ఫలితంగా ఈ మానవజన్మ, అందులోనూ, భారతదేశంలో హిందువుగా పుట్టటం, అందులోనూ, దైవం అంటే నమ్మకం ఉన్న వాడిగా పుట్టటమే కాకుండా త్రికరణ శుద్ధిగా సనాతన ధర్మాన్ని జీవితాంతం పాటించటం ఒక వరం. మనకి మాత్రమే దక్కిన అరుదైన వరం.

హిందూ సాంప్రదాయం చాలా గొప్పది

భారతీయులారా మిత్రులారా మీకు ఇవి తెలుసా?

భూమి గోళాకారంలో ఉందని మొదట చెప్పింది మనమే (ఆర్యబట్ట).

భూమికి గురుత్వాకర్షణ శక్తి ఉందని మొదట చెప్పింది మనమే (భాస్కరాచార్య). ప్రపంచంలో మొట్టమొదటి శస్త్ర చికిత్స చేసింది మనమే (సుశ్రుతుడు). విద్యుత్ మొట్టమొదట కనిపెట్టింది మనమే (అగస్త్యుడు). విమాన శాస్త్రాన్ని అందించింది మనమే (భరద్వాజమహర్షి). భూకంపాలను ముందుగా ఊహించే శాస్త్రమును రాసిన వరాహమిహిరుడు మనవాడే.

గణితం, భౌతికం, ఖనిజం శాస్త్రాల ఎన్‌సైక్లోపీడియా అక్షరలక్ష రాసిన వాల్మీకి మహర్షి మనవాడే.

రసాయన శాస్త్రం అందించిన నాగార్జునుడు.

కాస్మోలజీ చెప్పిన కపిలుడు, అణువులు గురించి వివరించిన కణాదుడు, DNA గురించి చెప్పిన బోధిధర్మ, మేఘ శాస్త్రాన్ని చెప్పిన అత్రి మహర్షి, మొదటిగా పత్తి నుండి దారాన్ని తీసి వస్త్రాలను తయారుచేసిన ఉత్సమధుడు.

సంగీతాన్ని (స.రి.గ.మ.ప) ప్రపంచానికి అందించిన స్వాతి ముని ఇలా ప్రపంచం కళ్లు తెరవకముందే మన ఋషులు ప్రపంచానికి ఎంత విలువైన విజ్ఞానాన్ని అందించారు.

ఎందరో మహానుభావులు అందరికీ వందనములు.

నా దేశం గొప్పది నా "సనాతన ధర్మం" గొప్పది నా హైందవ ధర్మం గొప్పది.

దక్షిణ మధ్య రైల్వే

దక్షిణ మధ్య రైల్వే యొక్క టెండరు నోటీసులలోని వివరములు మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.in నందు కూడా చూడవచ్చును.

బహిరంగ ఈ-టెండరు నోటీస్ నెం. డిఆర్ఎం/పనులు/బిజెడ్ఎ/21/2023/ తేది : 10.08.2023 PUB/0912

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకం చేసిన వారు దిగువ తెలిపిన పని కొరకు ఆయా పనులకు ఎదురుగా సూచించిన తేదీలలో గం. 15.00 వరకు ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

వ.నెం.: 1. టెండరు నెం. : ఈ-13-సెంట్రల్-బిజెడ్ఎ-2023. పని వివరణ- పని పేరు : ఎస్‌డబ్ల్యు-I) విజయవాడ డివిజన్: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్ : డిఇఎన్/ సెంట్రల్/విజయవాడ పరిధిలో ఎడిఇఎన్/ఈఈ సబ్-డివిజన్ యందు అద్వానియా- నూజివీడు సెక్షన్‌లో అప్ లైన్‌పై 9.137 కి.మి. పొడవున 1.346 కి.మి. 60 కేజీ 90 యుటీఎస్ రైల్స్‌తో టిఆర్ఆర్(పి) మరియు డౌన్ లైన్‌పై 60 కేజీ 110 యుటీఎస్ రైల్స్ (1175 హెచ్‌టి రైల్స్‌తో టిఆర్ఆర్(పి) చేయుట. ఎస్‌డబ్ల్యు-II) విజయవాడ డివిజన్: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్ : డిఇఎన్/ సెంట్రల్/విజయవాడ పరిధిలో ఎడిఇఎన్/బిపిపి సబ్ డివిజన్ యందు పద్వానియా/ఏలూరు సెక్షన్‌లో మొత్తం 0.963 కి.మి. పొడవున సిటిఆర్ (ఎస్) చేయుట. ఎస్‌డబ్ల్యు-III) విజయవాడ డివిజన్: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్ : డిఇఎన్/ సెంట్రల్/విజయవాడ పరిధిలో ఎడిఇఎన్/ఈఈ సబ్ డివిజన్ యందు వివిధ లొకేషన్లలో 7.495 మొత్తం కి.మి. పొడవున టిఎఫ్ఆర్ (ఆల్ ఫిట్టింగ్స్) చేయుట. ఎస్‌డబ్ల్యు-IV) విజయవాడ డివిజన్: డిఇఎన్/ సెంట్రల్/విజయవాడ పరిధిలో వివిధ లొకేషన్లలో ఎస్ఈజే-14 సెట్లు, జెజె-151 నెంబర్లు టిటిఆర్ఆర్ (ఎఫ్ఎస్+టిడబ్ల్యుఎస్+ డబ్ల్యుసిఎంఎస్‌సి)-25 సెట్లు, టిటిఆర్ఆర్ (ఎఫ్ఎస్+డిఎస్)- 18 చేయుట. పూర్తి చేయు కాలము: 12 (పన్నెండు) నెలలు. టెండరు విలువ: రూ. 2,13,43,145/-. ధరావత్తు: రూ. 2,56,700/- మూసివేయు తేది: 31-08-2023.

వ.నెం.: 2. టెండరు నెం. : ఈ-18-బ్రిడ్జెస్-బిజెడ్ఎ-2023. పని వివరణ- పని పేరు : ఎస్-ఎస్ఈ/బిఆర్/బిటిటిఆర్ సెక్షన్ క్రింద 355/ఎ అప్ అండ్ డౌన్ (2X9.15ఎం) మరియు ఎస్ఎస్ఈ/బిఆర్/I/ఆర్‌జెవై సెక్షన్ క్రింద బిఆర్ నెం. 236 అప్ అండ్ డౌన్ (3X12.19), 245 డౌన్ (3X12.19), 614 అప్ అండ్ డౌన్ (3X12.19), 628 అప్ (6X12.19), రీ గర్డరింగ్ పనుల ద్వారా వంతెనల యొక్క రిహాబిలిటేషన్ చేయుట. పూర్తి చేయు కాలము: 14 (పద్నాలుగు) నెలలు. టెండరు విలువ: రూ. 9,95,45,732/-. ధరావత్తు: రూ. 6,47,700/- మూసివేయు తేది: 29-08-2023.

వ.నెం.: 3. టెండరు నెం. : ఈ-18-ఈస్ట్-బిజెడ్ఎ-2023. పని వివరణ- పని పేరు : విజయవాడ డివిజన్: ఎస్‌డబ్ల్యు- I) ఎడిఇఎన్/లైన్స్/బిజెడ్ఎ సబ్ డివిజన్ యొక్క ఎస్-ఎస్ఈ/ పి-వే/సౌత్/బిజెడ్ఎ, నార్త్/బిజెడ్ఎ అండ్ ఎస్-ఎస్ఈ/పి-వే/జిడివి సెక్షన్ల ఇన్-సర్వీస్ రైల్స్ పెయింటింగ్ చేయుట. ఎస్‌డబ్ల్యు- II) ఎడిఇఎన్/ బివిఆర్ఎం సబ్ డివిజన్ యొక్క ఎస్ఎస్ఈ/పి-వే/ బివిఆర్ఎం, టిఎంపయూ అండ్ ఎంటిఎం సెక్షన్‌లో ఇన్- సర్వీసు రైల్స్‌కు పెయింటింగ్ చేయుట. పూర్తి చేయు కాలము: 12 (పన్నెండు) నెలలు. టెండరు విలువ: రూ. 2,83,04,955/-. ధరావత్తు: రూ. 2,91,500/- మూసివేయు తేది: 25-08-2023.

1) ఔత్సాహిక టెండరుదారులు పై టెండరు మూసివేయు తేదికి ముందు రోజు వరకు ఏవైనా సవరణలు/ మార్పులు చేయబడివేమో తెలుసుకొనుట కొరకు మా వెబ్‌సైట్ www.ireps.gov.in సందర్శించవలసిందిగా సూచించడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ.

టెండరు నోటీస్ నెం. 10/డబ్ల్యుడబ్ల్యుఎస్/ఆర్‌వైపిఎస్/2023-24, తేది : 11-08-2023 PUB/0913

భారత రాష్ట్రపతి తరపున డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్/ఆర్‌వైపిఎస్, దక్షిణ మధ్య రైల్వే, వేగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి-521241 వారు ఈ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

టెండరు నెం. : జిఆర్/ఎం/202/ఎయిర్ బ్రేక్/ 10/2023.

వివరణ : ఎయిర్ బ్రేక్ షాపు యందు 24 నెలల కాలం పాటు ఎయిర్ బ్రేక్ కాంపోనెంట్లకు స్ట్రిప్పింగ్, క్లీనింగ్, ఓవర్ హాలింగ్ అండ్ ఫిట్‌మెంట్ చేయుట.

సంఖ్య : 1. స్ట్రిప్పింగ్, క్లీనింగ్, స్క్రాపింగ్, స్కేల్ రిమూవల్, ఓవర్ హాలింగ్, టెస్టింగ్, ఫిట్‌మెంట్ 2 వేగన్ ఆఫ్ ఏఆర్ మరియు అవసరమైతే మూడవ ఎఆర్ బ్రాకెట్ ఏర్పాటు మరియు అవసరములకు తగినట్లుగా 13,500 సంఖ్యకు వెల్డింగ్ చేయుట. 2. స్ట్రిప్పింగ్ ఆఫ్ డివి వేగన్, ఎయిర్‌బ్రేక్ సెక్షన్‌కు రవాణా, సంఖ్య : 15,120 నెంబర్లు. 3. వేగన్ నుండి డర్ట్ కలెక్టర్లను విడదీయుట, ఎయిర్ బ్రేక్ సెక్షన్‌కు 27,000 రవాణా చేయుట. 4. వేగన్ నుండి 10,800 బ్రేక్ సిలిండర్లను విడదీయుట మరియు ఎయిర్ బ్రేక్ సెక్షన్‌కు రవాణా చేయుట.

పూర్తి చేయు కాలము : 24 నెలలు.

టెండరు విలువ : రూ. 1,86,67,311.16 (ఒక కోటి ఎనభై ఆరు లక్షల అరవై ఏడువేల మూడువందల పదకొండు రూపాయల పదహారు పైసలు మాత్రమే).

ధరావత్తు : రూ. 2,43,300/- (రెండులక్షల నలభై మూడువేల మూడువందల రూపాయలు మాత్రమే)

టెండరు డాక్యుమెంట్ వెల : ఉచితం

ఆఫర్ కాలపరిమితి: తెరచు తేదీ నుండి 60 రోజులు

టెండరు తరహా: ఐఆర్‌జిసిసి-2022 ద్వారా నిర్వహించబడే పనుల టెండర్

టెండరింగ్ విధానం : బహిరంగ టెండరు- సింగిల్ ప్యాకెట్

ఇదే తరహా పని : వర్తించును

బిడ్ మూసివేయు తేదీ మరియు సమయం: 15:00 గంటలు తేదీ : 05-09-2023

బిడ్ తెరచు తేదీ మరియు సమయం: 15:15 గంటలు తేదీ : 05-09-2023

టెండరు డాక్యుమెంట్ మరియు సవరణలు: టెండరు డాక్యుమెంట్ మరియు మార్పులు/సవరణలు ఏవైనా ఉంటే చూచుట కొరకు మా వెబ్‌సైట్ http:www.ireps.gov.in సందర్శించండి.

డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్, వేగన్ వర్క్‌షాప్, గుంటుపల్లి. A1276

టెండరు షరతులు/వివరాలు/ నిబంధనలు, మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in ను సందర్శించండి.

విశాఖ సమాచారమ్

ప్రతులకు, ప్రకటనలకు

సెల్: 9393949345

8247526179

# కొత్త చట్టం: ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తే తబిడ దిబిడే!



కేంద్ర హోంమంత్రి అమిత్ షా తాజాగా మూడు బిల్లులను లోక్ సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సమీక్ష కోసం పార్లమెంట్‌కు స్టాండింగ్ కమిటీకి ప్రతిపాదిత బిల్లు పంపబడింది. ఈ సమయంలో నకిలీ వార్తలు, తప్పుడు సమాచారాల విషయంలో జైలు శిక్షను అందులో ప్రతిపాదించింది.

అవును భారతీయ న్యాయ సంహిత బిల్లు-2023 ప్రకారం భారతదేశ సార్వభౌమాధికారం, భద్రతకు హాని కలిగించే నకిలీ వార్తలు లేదా తప్పుదారి పట్టించే సమాచారాన్ని వ్యాప్తి చేస్తే సెక్షన్ 195 ప్రకారం మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుంది. సెక్షన్ 195 (1) (డీ) ప్రకారం మూడు సంవత్సరాల వరకు పొడిగించబడే జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధించబడతాయి.

కొత్తగా ప్రతిపాదించబడిన బిల్లులోని 11వ అధ్యాయంలో "ప్రజా ప్రశాంతతకు వ్యతిరేకంగా నేరాలు" లోని, "ఆరోపణలు, జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించే వాదనలు" అనే అంశం క్రింద ఈ సెక్షన్స్‌కి సంబంధించిన వివరాలు ఉన్నాయని తెలుస్తోంది. ప్రస్తుతం ఐపీసీలోని సెక్షన్ 153బీ కింద "ఆరోపణలు, జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించే వాదనలు"కి సంబంధించిన నిబంధనలు ఉన్న సంగతి తెలిసిందే.

పౌరులకు రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను పరిరక్షించడమే ఈ మూడు కొత్త చట్టాల ఆత్మ అని బిల్లులను ప్రవేశపెడుతూ అమిత్ షా అన్నారు. భారతీయ న్యాయ సంహిత బిల్లు-2023, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత బిల్లు-2023, భారతీయ సాక్ష్యా బిల్లు-2023లే ఆ మూడు బిల్లులు.

ఈ బిల్లులు బ్రిటీష్ వారు రూపొందించిన ఇండియన్ పీనల్ కోడ్ - ఐపీసీ (1860), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ - సీఆర్పీసీ (1898), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (1872)లను రద్దు చేస్తాయి.

ఇందులో భాగంగా భారత శిక్షాస్మృతి స్థానంలో భారతీయ న్యాయ సంహిత బిల్లు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత బిల్లు ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష్యా బిల్లు రానుందని అమిత్ షా తెలిపారు.

# 2024 మాత్రమే కాదు 2027, 2032 కూడా మావే : యోగీ ఆదిత్యనాథ్



యూపీలో భారీ మెజారిటీతో వరుసగా రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుతోంది. అదే సమయంలో యూపీలో తమ పాలనను సుస్థిరం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. దీంతో తాజాగా జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సీఎం యోగి ఆదిత్యనాథ్.. బీజేపీ భవిష్యత్ విజయాలపై కీలక జోస్యం చెప్పారు. వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలతో పాటు 2027, 2032లో జరిగే యూపీ ఎన్నికల్లోనూ తామే గెలుస్తామన్నారు.

ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నిన్న అసెంబ్లీలో 2024 పార్లమెంట్ ఎన్నికల ఫలితం ఇప్పటికే ఖరారైందని, 2027, 2032లో రాష్ట్రంలో జరిగే ఎన్నికలలో కూడా బీజేపీ విజయం సాధిస్తుందని ప్రకటించారు. వ్యవసాయ ఆదాయం, కుల గణన, శాశ్వత డీజీపీని నియమించడంలో వైఫల్యంపై విధానసభలో ప్రభుత్వాన్ని విపక్షాలు లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో విపక్ష నేత అఖిలేష్‌ను యోగి హేళన చేస్తూ 2014, 2017, 2019, 2022 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మిమ్మల్ని ఎందుకు ఎన్నుకోలేదో మీ ప్రసంగం స్పష్టం చేసిందని అన్నారు.

2014, 2017, 2019, 2022 సంవత్సరాల్లో ప్రజల తీర్పులు అలా ఉండవని అఖిలేష్ ప్రకటన స్పష్టం చేస్తోందని యోగి తెలిపారు. వెండి చెంచాతో పుట్టిన వారికి పేదలు, రైతులు, దళితుల సమస్యలు అర్థం కావన్నారు. గత ప్రభుత్వ హయాంలో వెనుకబడిన వర్గాలను ఆదుకున్నట్లు ఎవరికీ కనిపించడం లేదన్నారు. విచ్చలవిడి పశువులు పంటలను ధ్వంసం చేయడం, ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న అంశంపై అఖిలేష్‌ను యోగి టార్గెట్ చేశారు. తమ హయాంలో జంతువులను కబేళాలకు ఇవ్వడంపై యాదవ్ ఇప్పుడు ఆందోళన చెందుతున్నారని విమర్శించారు.

అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు చివరి రోజు అఖిలేష్ తన ప్రసంగంలో గోరఖ్‌పూర్‌లో విచ్చలవిడి పశువులు, ద్రవ్యోల్బణం, నీటి ఎద్దడి వంటి సమస్యలను ప్రస్తావించారు. నీటి ఎద్దడిపై సీఎం ఆరోపణను తోసిపుచ్చారు. ఊహించని విధంగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ గోరఖ్‌పూర్ ప్రజలు హాయిగా జీవిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయుల అరెస్టుకు దారితీసిన పాఠశాల విద్యార్థిని మరణంలో ఉపాధ్యాయులు బెయిల్‌పై విడుదలయ్యారని గుర్తుచేశారు. వీటికి యోగి కౌంటర్ ఇచ్చారు.

# పట్టాలు తప్పిన ఎక్స్‌ప్రెస్- పలువురు ప్రయాణికులు దుర్మరణం



ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు 15 మంది ప్రయాణికులు దుర్మరణం పాలయ్యారు. 50 మందికి పైగా గాయపడ్డారు. గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఫలితంగా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలను చేపట్టారు. గాయపడ్డ వారిని సమీప ఆసుపత్రికి తరలిస్తోన్నారు. చెల్లాచెదురుగా పడిన బోగీల్లో ఇరుక్కున్న ప్రయాణికులను సురక్షితంగా వెలికి తీసే పనుల్లో నిమగ్నం అయ్యారు.

కరాచి నుంచి రావల్పిండి మధ్య నడిచే హజారా ఎక్స్‌ప్రెస్ ఈ మధ్యాహ్నం పట్టాలు తప్పింది. కరాచి నుంచి బయలుదేరిన ఈ ఎక్స్‌ప్రెస్ ఈ అర్ధరాత్రికి రావల్పిండికి చేరుకోవాల్సి ఉంది. ఈ రెండు నగరాల మధ్య దూరం 1,309 కిలోమీటర్లు. 18 గంటల సమయం పడుతుంది. కరాచి నుంచి బయలుదేరిన ఈ రైలు మార్గమధ్యలో షాజాద్ పూర్- నవాబ్‌షా మధ్య గల సహారా రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది.

షాజాద్‌పూర్ స్టేషన్‌ను దాటిన కొద్దిసేపటికే ఈ దుర్ఘటన సంభవించింది. 10 బోగీలు పట్టాలు తప్పాయి. రైలు వేగానికి చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ ఘటనలో ఇప్పటివరకు 15 మంది ప్రయాణికులు మరణించినట్లు రేడియో పాకిస్తాన్ తెలిపింది. 50 మందికి పైగా గాయపడ్డారని పేర్కొంది.

ఈ ఘటనపై షహీద్ బెంజీరాబాద్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహమ్మద్ యూనిస్ చాందీయో స్పందించారు. సమాచారం తెలిసిన వెంటనే సహాయక బృందాలను నవాబ్ షా నగరానికి పంపించినట్లు చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలను చేపట్టామని, మరణాల సంఖ్యను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు.

పాకిస్తాన్ ఫెడరల్ రైల్వే, ఏవియేషన్ మంత్రి ఖవాజా సాద రఫీక్ ఈ ఘటనపై మాట్లాడారు. లాహోర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రమాదం చోటు చేసుకున్న సమాచారం అందిన వెంటనే అదనపు బలగాలు, సహాయక బృందాలు, సామాగ్రిని సంఘటన స్థలానికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి పట్ల సింధ్ ముఖ్యమంత్రి మురాద్ అలీ షా సంతాపం వ్యక్తం చేశారు.

# బూడిదైన హవాయి స్వర్గధామం - ఎటు చూసినా కాలిన శవాలే



శతాబ్దాల చరిత్ర కలిగిన ఆ పర్యాటక నగరం ఇప్పుడు బూడిద దిబ్బగా మారింది. సుమారు 12వేల మంది నివాసముంటున్న పర్యాటక నగరం తగలబడిపోయింది. ఇప్పుడు ఆ టూరిస్ట్ సిటీలో ఎటు చూసినా కాలిన శవాలు, బూడిదైన భవనాలే కనిపిస్తున్నాయి. దీనికంతటికీ కారణం కార్చిచ్చు!

అవును అమెరికాలో హవాయి దీవులను స్వర్గధామంగా పిలిచే లహైనా రిసార్టు నగరంలో కార్చిచ్చు రగిలింది. పెను విషాదాన్ని మిగిల్చింది. ఈ ప్రకృతి విపత్తు వల్ల ఇప్పటివరకూ 67 మంది బలైపోయారు. ఆస్తినష్టం పరంగా హవాయి చరిత్రలోనే రెండో అతిపెద్ద విపత్తు ఇదని అధికారులు చెబుతున్నారు.

వివరాల్లోకి వెళ్తే హవాయి దీవుల సమూహంలో ఒకటైన మౌయి దీవిలో గల లహైనా పట్టణంలో మొదలైన కార్చిచ్చు బీభత్సం సృష్టించింది. ఈ కార్చిచ్చుకి హరికేన్ ప్రభావంతో బలమైన ఈదురు గాలులు తోడవ్వడంతో క్షణాల్లోనే పట్టణమంతా ఫైర్ విస్తరించింది. చూస్తుండగానే కళ్లముందరే అంతా తగులబడిపోయింది.

దీంతో స్థానిక ప్రజలు ప్రాణభయంతో పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన సహాయక సిబ్బంది మంటలను అదుపుచేసేందుకు శ్రమించినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. వేల సంఖ్యలో నివాసాలు, ఇతర భవనాలు కాలి బూడిదవ్వగా రోడ్ను మీద నిలిపి ఉంచిన వాహనాలు నామరూపాల్లేకుండా కాలిపోయాయి.

ఈ కార్చిచ్చు కారణంగా వందల సంఖ్యలో పక్షులు, జంతువులు మంటల్లో కాలిపోయాయి. ఇదే సమయంలో ఇప్పటివరకు 67 మంది ప్రాణాలు కోల్పోగా శిథిలాల కింద మరింత మంది చిక్కుకున్నారని అధికారులు అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అంటున్నారు.

అయితే ఈ స్థాయిలో ప్రాణనష్టం కలగడానికి అధికారుల నిర్లక్ష్యం కారణం అని ఆరోపిస్తున్నారు. మంటలు నివాసాల సమీపానికి చేరేముందు హవాయి ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఎలాంటి వార్నింగ్ సైరన్లు మోగించలేదని అంటున్నారు. దీంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగిందని అంటున్నారు.

# ఏ పండు తింటే ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు పొందుతారు ?



బొప్పాయి, పుచ్చకాయలలో బీటా క్రిపాక్సాంథిన్ గుణాలు ఎక్కువగా వుంటాయి. ఇవి లంగ్ క్యాన్సర్ దరిచేరకుండా కాపాడతాయి. బొప్పాయిలోని పపెయిన్ ఎంజైమ్ జీర్ణశక్తికి సహకరిస్తుంది. అజీర్తితో బాధపడేవారికి బొప్పాయి దివ్యౌషధం. ఇందులో విటమిన్ సి, విటమిన్ ఏ ఉంటాయి. దానిమ్మ మెదడులో వాపును తగ్గించడంతో పాటు అల్జీమర్స్ ను నియంత్రిస్తుంది. విటమిన్ సి, కె కాకుండా రకరకాల పోషకాలతో నిండిన దానిమ్మ శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. గుండె ఆరోగ్యం పదిలంగా ఉండాలంటే.. ద్రాక్ష పండ్లను తీసుకోవాలి. ద్రాక్ష, లిచీ పండ్లలో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పాలిపినాల్స్ అధికంగా ఉంటాయి. క్యాన్సర్ వంటి వ్యాధులను అరికట్టడంలో పాలిఫినాల్స్ ఉపయోగపడతాయి. బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్ పెట్టాలంటే లిచీ పండ్లు తింటూ ఉండాలి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉంటుంది. తక్కువ ధరకే దొరికే ఒక కప్పు జామపండు ముక్కల్లో లభించే విటమిన్ సి రోజువారీ అవసరాని కంటే ఐదు రెట్లు ఎక్కువ వుంటుంది. వీటిని తరచుగా తీసుకుంటూ ఉండాలి. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ బి, క్యాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, ఐరన్, ఫోలిక్‌యాసిడ్ వంటివి మెండుగా ఉన్నాయి. జీర్ణశక్తిని పెంపొందించే ఫైబర్ ఇందులో పుష్కలంగా ఉంటుంది. విటమిన్ సి అధికంగా ఉండే పండ్లు తినే మహిళల్లో చర్మంపై ముడతలు వచ్చే అవకాశాలు మిగతా వారి కంటే తక్కువగా ఉంటాయి. బ్యాక్టీరియాను ఎదుర్కొనే శక్తి కూడా కమలా పండ్ల నుంచి లభిస్తుంది. ఏడాది పొడవునా దొరికే అరటి పండు తీసుకుంటే శరీరానికి కావాల్సిన శక్తి, సహజ చక్కెరలు తక్షణం శరీరానికి అందుతాయి. అరటిపండులో పీచు పదార్థాల మోతాదు కూడా ఎక్కువగా వుంటుంది. రక్తపోటును తగ్గించే పొటాషియం అత్తి, అరటిపండ్లలో లభిస్తుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గించగల పీచుపదార్థం యాపిల్స్‌లో ఎక్కువగా లభిస్తాయి. రోజుకు అవసరమైన పీచులో నలభై శాతం ఈ పండ్ల నుంచి లభిస్తుంది. పీచుపదార్థాలు ఎక్కువగా తినేవారిలో కొలెస్ట్రాల్ స్థాయి తక్కువగా ఉంటుంది. సంపూర్ణ ఆరోగ్యం కోసం.. ప్రకృతి సిద్ధంగా లభించే ఆహారపదార్థాలు ఎంచుకుంటే మంచిది. అలా ప్రకృతి ప్రసాదితమైనది నేరేడు. నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోయే ఈ పండు పోషకాల గని. అనారోగ్యాల నివారిణి. విటమిన్లు, క్రోమియం నేరేడులో పుష్కలంగా ఉంటాయి.

# గసగసాలతో ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే తప్పక వాడతారు




తెల్లగా, చిన్నగా ఉండే గసగసాల్ని ఈ రోజుల్లో మనం వంటల్లో వాడుతున్నాంగానీ పూర్వం వాటిని మందుల తయారీలో వాడేవాళ్లు. మిగతా సుగంధ ద్రవ్యాలలాగే గసగసాలు కూడా చాలా ముఖ్యమైనవి. వాటితో కలిగే ప్రయోజనాలు తెలియక చాలా మంది మిగతా మసాలా ఐటెమ్స్ కొనుక్కుంటారు కానీ, గసగసాల్ని కొనేందుకు అంతగా ఇష్టపడరు. ఇప్పుడవి కొనకపోతే, కూర టేస్ట్ మారిపోతుందా అని అనుకుంటారు. ఐతే గసగసాలు కూరలకు ఎంతో టేస్ట్ ఇస్తాయి. కుర్మా లాంటి వాటిలో గసగసాల్ని వేయడం ద్వారా ప్రత్యేక రుచి, కమ్మదనం వస్తుంది. ఈ రోజుల్లో ప్రతీదీ పొడుల రూపంలో వచ్చేస్తున్నా, చిన్నగా ఉండే గసగసాలు మాత్రం పొడిలా కాకుండా అవి ఎలా ఉన్నాయో, అలాగే ప్యాకింగ్‌లో దొరుకుతున్నాయి. మరి గసగసాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు తెలుసుకుందాం.

గసగసాలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు : కిడ్నీల్లో రాళ్లు ఏర్పడకుండా చేసే శక్తి గసగసాలకు ఉంది. వీటిలో ఉండే ఆక్సలేట్లు కాల్షియంను గ్రహించి, రాళ్లు ఏర్పడకుండా చేస్తాయి. మలబద్ధకాన్ని తగ్గిస్తాయి. గసగసాల్లో ఫైబర్ (పీచు పదార్థం) ఎక్కువ. ఇది పేగులు బాగా కదిలేలా చేస్తుంది. తద్వారా మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. నిద్రకు మేలు. కొంతమందికి సరిగా నిద్ర పట్టదు. అలాంటి వారు గసగసాలు తీసుకోవాలి. రోజు పడుకునే ముందు వేడి పాలలో గసగసాల పేస్ట్‌ను కొద్దిగా కలిపి తాగితే చాలు... చక్కటి నిద్ర వచ్చేస్తుంది. శ్వాస సమస్యలకు చెక్. గసగసాలు ఎక్స్‌పెక్టొరెంట్, సిమల్సెంట్ (నయం చేసే గుణాలు) గుణాలు కలిగి ఉన్నాయి. అందువల్ల ఇవి శ్వాస సంబంధిత సమస్యల్ని తగ్గిస్తాయి. దగ్గు, ఆస్తమా వంటివి తగ్గుతాయి. గుండె సమస్య ఉన్నవారు గసగసాలు లైట్‌గా ఫ్రై చేసి, షుగర్ కలిపి మార్నింగ్, ఈవెనింగ్ హాఫ్ స్పూన్ (అర చెంచాడు) తీసుకొంటే గుండె హాయిగా ఉంటుంది. గసగసాలు చలవ చేస్తాయి. శరీరంలో వేడి ఎక్కువగా ఉంటే గసగసాలు వాడొచ్చు. కడుపులో మంట, ఎసిడిటీ వున్న వారు గసగసాల్ని వాడితే పేగులలో అల్సర్లు, పుండ్లు వంటివి తగ్గుతాయి. గసగసాలతో ఈ ప్రయోజనాలు ఉన్నాయి కదా అని వీటిని మరీ ఎక్కువగా వాడటం మాత్రం మంచిది కాదు. గసగసాలు ఎక్కువగా తింటే, మగవాళ్లలో స్పెర్మ్ కౌంట్ తగ్గిపోతుంది. లైంగిక సామర్థ్యం దెబ్బతింటుంది.

# పచ్చి వెల్లుల్లి తింటే ఎన్ని లాభాలో!



వెల్లుల్లి దాదాపు ప్రతి వంటగదిలో కనిపిస్తుంది. ఇది వంటలకు మంచి రుచి, సువాసన ఇస్తుంది. వెల్లుల్లిలో ఎన్నో ఔషద గుణాలు ఉన్నాయి. ఆయుర్వేదంలో పురాతన కాలం నుంచి అనేక వ్యాధుల చికిత్సకు ఔషధంగా దీన్ని ఉపయోగిస్తున్నారు. వెల్లుల్లిలో అత్యంత శక్తివంతమైన అల్లిసిన్ అనే కాంపౌడ్ ఉంది. దీని కారణంగా, వెల్లుల్లిలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నాయి. దీనిలో విటమిన్లు B1, B2, B3, B6, ఫోలేట్, విటమిన్ సి, కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, ఫాస్పరస్, పొటాషియం, సోడియం, జింక్ వంటి వంటి పోషకాలెన్నో ఉంటాయి. వెల్లుల్లిని ఏ రూపంలోనైనా మన డైట్‌లో చేర్చుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అయితే, పచ్చి వెల్లుల్లిని ఉదయం పూట తిని నీళ్లు తాగితే మరిన్ని ప్రయోజనాలు పొందవచ్చని అంటున్నారు. డిటాక్స్‌ప్రి వ్యవస్థాపకురాలు, హోలిస్టిక్ డైటీషియన్ ప్రియాంషి భట్నాగర్ ఉదయాన్నే పచ్చి వెల్లుల్లిని తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు మనకు వివరించారు.

**రక్తప్రసరణ మెరుగుపడుతుంది:** ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి వెల్లుల్లి తిని, నీళ్లు తాగితే హైపర్‌టెన్షన్ లక్షణాలు తగ్గుతాయని ప్రియాంషి భట్నాగర్ అన్నారు. వెల్లుల్లిలోని పోషకాలు శరీరంలో రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. వెల్లుల్లిని రోజూ తినడం వల్ల గుండెకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. శరీరం లోపల రక్తం గడ్డకట్టకుండా కాపాడుతుంది. ఇందులోని యాంటీ క్లాటింగ్ గుణాలే దీనికి కారణం. వెల్లుల్లి తింటే.. లివర్, మూత్రాశయం పనితీరు మెరుగుపడుతుంది. వెల్లుల్లిలోని సమ్మేళనాలు కాలేయంలోని విషపదార్థాలను బయటకు పంపుతాయి.

**అతిసారం నయం అవుతుంది :** డయేరియాతో బాధపడేవారు, ఉదయం ఖాళీ కడుపుతో పచ్చి వెల్లుల్లి తింటే ఉపశమనం లభిస్తుంది. వెల్లుల్లి జీర్ణక్రియలో తోడ్పడుతుంది. పేగుల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. వెల్లుల్లి నాడీ వ్యవస్థకు మంచిది. ఇది ఆకలిని ప్రేరేపిస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

**ఒత్తిడి తగ్గిస్తుంది :** బీజీబీజీ లైఫ్‌స్టైల్ కారణంగా, ఈ రోజుల్లో ఒత్తిడి పెరిగింది. వెల్లుల్లి మీ ఒత్తిడి స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. వెల్లుల్లిలో సల్ఫర్ కాంపౌడ్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది గ్లూటాతియోన్ స్థాయిలను పెంచుతుంది. ఈ యాంటీ ఆక్సిడెంట్ ఒత్తిడికి వ్యతిరేకంగా పనిచేస్తుంది.

**కొలెస్ట్రాల్ కరుగుతుంది :** పచ్చి వెల్లుల్లి గుండె సంబంధ వ్యాధులకు (CVD) మెరుగ్గా పనిచేస్తుందని NCBI నివేదిక వెల్లడించింది. చెడు కొలెస్ట్రాల్ (LDL-C), ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో వెల్లుల్లి ప్రభావవంతంగా పనిచేస్తున్నట్లు కనుగొన్నారు. వెల్లుల్లిలో హ్యూమన్ 3-హైడ్రాక్సీ-3-మిథైల్‌గ్లుటరిల్-కోఎంజైమ్ A (HMG-CoA), స్క్వాలీన్ మోనో ఆక్సిజనేస్ వంటి అంశాలు ఉన్నాయి, ఇవి కొలెస్ట్రాల్‌ను నివారించడంలో సహాయపడతాయి.

**లివర్‌కు మంచిది :** లివర్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, దాని పనితీరు మెరుగుపరచడానికి పచ్చి వెల్లుల్లి తినడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. వెల్లుల్లి లివర్ ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. వెల్లుల్లిలో యాంటీ బ్యాక్టీరియల్ యాంటీ ఇన్ఫ్లమేషన్, యాంటీ వైరల్ గుణాలు ఉన్నాయి. ఇవన్నీ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా, ఒకవేళ ఇన్‌ఫెక్షన్లు తలెత్తినా త్వరగా కోలుకోవటానికి తోడ్పడతాయి.

**బాడీ క్లీన్ అవుతుంది :** వెల్లుల్లిలో అధిక మొత్తంలో సల్ఫర్ సమ్మేళనాలు అధిక మొత్తంలో ఉంటాయి. ఇది శరీర భాగాలను లోపల నుంచి శుభ్రపరుస్తుంది. వెల్లుల్లి రక్తంలో సీసం స్థాయిని తగ్గిస్తుంది. పచ్చి వెల్లుల్లి తింటే శరీరంలో ఉంటే ఫ్రీ రాడికల్స్ తొలగుతాయి.

**ఎలా తినాలి?** ఎక్కువ ప్రయోజనాలు పొందడానికి, వెల్లుల్లిని పచ్చిగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మీరు ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో రెండు వెల్లుల్లి రెబ్బలను నమిలి, నీళ్లు తాగండి.

# వాతావరణంలో మార్పులతో చర్మం పొడిబారటం వంటి సమస్యలు వేధిస్తున్నాయా?



వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే ముఖంపై జిడ్డు పేరుకుపోతుంది. ఉదయం, సాయంత్రం నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే దీని నుంచి ఉపశమనం లభిస్తుంది. దీని వల్ల జిడ్డుతో పాటు ముఖంపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి కణాలు తొలగిపోతాయి. సీజన్ మారితే వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటాయి. దగ్గు, జలుబు వంటి సీజనల్ వ్యాధు చుట్టుముట్టటంతో పాటు చర్మం పొడి బారడం, జుట్టు ఊడిపోవడం వంటి సమస్యలు వస్తాయి. దీంతో స్కిన్ పాడవుతుంది. జిడ్డు చర్మం కలిగినవారికి స్కిన్ మరింత ఆయిలీగా మారుతుంది. ఫలితంగా ముఖంపై మొటిమలు, మచ్చలు వంటివి వస్తాయి. చర్మం దురద పెట్టడం, పగలడం, ఇతర ఇన్‌ఫెక్షన్లు వంటి సమస్యలు కూడా వస్తుంటాయి. ఈ పరిస్థితి నుండి చర్మం, ముఖాలను రక్షించుకోవాలంటే కొన్ని చిట్కాలు తప్పక పాటించాలి.

వాతావరణంలో తేమ శాతం ఎక్కువగా ఉంటే ముఖంపై జిడ్డు పేరుకుపోతుంది. ఉదయం, సాయంత్రం నీటితో ముఖాన్నిశుభ్రం చేసుకుంటే దీని నుంచి ఉపశమనం లభిస్తుంది. దీని వల్ల జిడ్డుతో పాటు ముఖంపై పేరుకుపోయిన దుమ్ము, ధూళి కణాలు తొలగిపోతాయి. గాఢత ఉన్న ఫేస్ క్రీములు వాడకపోవడం మంచిది. దీనికి బదులుగా ఫ్రెష్ టోనింగ్ రోజ్ వాటర్ వాడవచ్చు. వర్షాకాలంలో వచ్చే చర్మ సంబంధ సమస్యలకు రోజ్ వాటర్ చెక్ పెడుతుందని పలు అధ్యయనాల్లో కూడా తేలింది. చర్మాన్ని రోజంతా మాయిశ్చరైజింగ్‌గా ఉంచడం చాలా అవసరం. చర్మం సహజసిద్ధంగా మాయిశ్చరైజ్ కావాలంటే శరీరంలో తేమ శాతం అధికంగా ఉండాలి. మంచి నీటిని ఎక్కువగా తాగితే చర్మం మాయిశ్చరైజ్ గా తయారై ప్రకాశవంతంగా ఉంటుంది. శనగ పిండి కూడా జిడ్డును తొలగించడంలో సాయం చేస్తుంది. శనగ పిండితో ప్రతిరోజూ స్నానం చేసినా చర్మం తాజాగా ఉంటుంది. దీంతో పాటు మీ చర్మతత్వానికి తగినట్లుగా మాయిశ్చరైజర్‌ను ఎంపిక చేసుకోండి. దీనిని రెగ్యులర్‌గా అప్లై చేస్తే చర్మం పొడిబారకుండా ఉంటుంది. ప్రతిరోజు కనీసం రెండు సార్లు అయినా ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. సాధారణ సబ్బుతో కాకుండా ఫేస్‌వాష్‌తో శుభ్రం చేసుకోవటం మంచిది. ఉదయం లేవగానే, రాత్రి పడుకోబోయే ముందు ఫేస్‌వాష్ చేసుకుంటే ముఖం ప్రకాశవంతంగా మారుతుంది. చర్మాన్ని రక్షించేందుకు ఫేస్ ప్యాక్స్ బాగా ఉపయోగపడతాయి. అరటి పండ్లు, బొప్పాయి, పుచ్చకాయ వంటి వాటిని మెత్తగా చేసి ముఖానికి అప్లై చేస్తే మంచి ఫలితం ఉంటుంది. తేనె, పసుపు, శనగపిండి కలిపిన ఫేస్ ప్యాక్ కూడా ముఖం తాజాగా ఉండేలా చేస్తుంది. వీటితో పాటుగా చర్మం ఆరోగ్యంగా ఉండటానికి ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. సాధ్యమైనంత వరకు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి. తాజా పండ్లు, ఆకుకూరలు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవటం మంచిది. గ్రీన్ టీ, లెమన్ టీ వంటివి చర్మంలో ఉండే మృత కణాలను తొలగించడంలో సహాయపడతాయి.

# టమాటో ఐస్ క్రీమ్ ! ఎలా చేయాలో మీకు తెలుసా?తయారీ వీడియో వైరల్




స్ట్రీట్ ఫుడ్ వెరైటీలు ప్రజలకు ఎంతగానో నచ్చుతాయి. తోపుడు బండ్లు, వీధి వ్యాపారుల వద్ద లభించే ఒక్క ఐటమ్ ని ఒక్కొక్కరు ఒక్కో రీతిలో తయారు చేస్తారు. అందుకే వాటి టేస్ట్ ఎక్కడి కక్కడ భిన్నంగా ఉంటాయి. అంతేకాదు.. కొత్త కొత్త వెరైటీ ఫుడ్స్ కనిపెట్టి కస్టమర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. అలాంటిదే ఈ వీడియో కూడా. ఇక్కడ ఓ వీధి వ్యాపారి ఎప్పుడూ చూడని వెరైటీ వంటకం తయారు చేస్తున్నాడు. వినడానికి విచిత్రంగా ఉన్నా, ఈ టమాటా ఐస్‌క్రీం చూసేందుకు మాత్రం అచ్చం అందరికీ ఇష్టమైన ఐస్ క్రీంలాగానే ఉంది. వీడియో చూసిన నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. టమాటాతో ఐస్ క్రీమా అని అవాక్కవుతున్నారు. ?

**టమాటా ఐస్ క్రీం తయారీ ఎలాగంటే :** ఫుడ్ వ్లాగర్, @aap-kabhai_foody ద్వారా వెళ్ళే రాజన్ మిశ్రా ఢిల్లీలో టొమాటో ఐస్ క్రీం తయారు చేస్తున్న స్ట్రీట్ ఫుడ్ విక్రేత వీడియోను షేర్ చేసారు. ఈ వీడియో వాస్తవానికి మేలో పోస్ట్ చేయబడింది. కానీ, ఇది ప్రస్తుత టమోటా ధరల నేపథ్యం, సమస్యల కారణంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వీడియోలో, స్ట్రీట్ ఫుడ్ విక్రేత టమాటాతో ఐస్ క్రీమ్ ఎలా తయారు చేశాడో చూస్తే.. ముందుగా తరిగిన టమాటాను మధ్యలో పెట్టి.. అతను దాని చుట్టూ కారామెల్ సాస్ పోస్తాడు. ఆ తరువాత తరిగిన టమాటా పైన పాలు పోసి, అన్ని పదార్థాలను బాగా కలిపేశాడు. ఆ మిశ్రమానంత బాగా కలిపి మంచి క్రీమ్‌లా తయారు చేశాడు. అ తరువాత, మిశ్రమాన్ని ఐస్ క్రీం రోల్స్‌లా తయారు చేశాడు. తయారైన ఐస్‌క్రీం రోల్స్‌ను ఒకదానిపై ఒకటి సర్వింగ్ ప్లేట్‌లో పేర్చాడు. దాని పై నుండి మళ్లీ కారామెల్, తరిగిన టమాటా ముక్కలు వేసి సర్వ్ చేస్తున్నాడు. పైగా అతడు ఈ ఐస్ క్రీమ్ తయారు చేయడానికి కేవలం 5 నిమిషాల సమయం మాత్రమే సరిపోతుందని అంటున్నాడు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వీడియోపై నెటిజెన్లు తమ అభిప్రాయాలను తెలియజేశారు.

**వీడియో చూసి నెటిజన్ల స్పందన:** చాలా మంది నెటిజన్లు ఈ టమాటా ఐస్‌క్రీమ్‌పై తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి విపరీత చేష్టల వల్లే టమాటా ధరలు పెరుగుతున్నాయని ఓ వ్యక్తి వ్యాఖ్యానించారు. ఈ రుచికరమైన ఐస్ క్రీం తినడానికి పావ్ కావాలని మరొకరు చమత్కరించారు. ఆ తర్వాత మరో నెటిజన్ 'వెల్‌కమ్ టు ఇండియా' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇది ఐస్‌క్రీమా లేదా బుర్జియా అంటూ చాలా మంది ఆశ్చర్యపోయారు. రోటీతో ఐస్‌క్రీమ్ ఎలా తీసుకుంటారని మరో నెటిజన్ ప్రశ్నించారు.

# గ్యాస్ స్టౌ ఇలా క్లీన్ చేస్తే మెరిసిపోతుంది




కిచెన్ క్లీనింగ్ అనేది అతి పెద్ద టాస్క్. దీనిని ఈజీగా చేసేందుకు కొన్ని టిప్స్ ఫాలో అవ్వొచ్చు. క్లీన్ చేసేటప్పుడు పరిశుభ్రత అతి ముఖ్యం. వంటగదిని క్లీన్ చేయడం ఓ పెద్ద పనిగా చూస్తాం. కానీ, దీనిని క్లీన్ చేసేటప్పుడు కొన్ని టిప్స్ పాటిస్తే నూనె మరకల నుండి మసాలాల వరకూ అన్ని మరకలు పోయి క్లీన్‌గా ఉంటుంది. అందుకోసం ఏమేం చిట్కాలు పాటించొచ్చో తెలుసుకుందాం.

నిమ్మరసం : గ్యాస్ స్టౌ క్లీనింగ్‌కి నిమ్మరసం, తొక్క రెండు బాగా పనిచేస్తాయి. వీటిని వాడి గ్యాస్‌స్టౌ పై మరకలని ఈజీగా తొలగించొచ్చు. ఇందుకోసం జిడ్డు మరకలపై నిమ్మ తొక్కని పెట్టి రబ్ చేయండి. కాసేపు రబ్ చేశాక నీటితో ఈ స్టౌన్ క్లీన్ చేయండి.

బేకింగ్ సోడా : ఒక్క బేకింగ్ సోడా ఉంటే చాలు.. ఎన్నో పనులు చేసుకోవచచు. గ్యాస్ స్టౌని తళతళ మెరిపించడంలో బేకింగ్ సోడా ది బెస్ట్. దీనిని కొద్దిగా తీసుకుని అందులో నిమ్మరసం లేదా వైట్ వెనిగర్ కలపి పేస్ట్‌లా చేయండి. ఇలా తయారైన పేస్ట్‌ని చక్కగా గ్యాస్‌పై నేరుగా అప్లై చేసి కాసేపు ఉంచి ఆ మరకలని క్లీన్ చేయండి.

వైట్ వెనిగర్: వెనిగర్‌ని ఇంట్లోని మచ్చలు పోగొట్టేందుకు వాడుతుంటాం. కిచెన్‌లో స్టౌపై మరకలు ఉంటే ముందుగా వెనిగర్ తీసుకుని ఆ మరకలపై కొద్దిగా చల్లండి. ఓ ఐదారు నిమిషాల పాటు అలానే ఉంచి ఆ తర్వాత క్లీన్ చేయండి. ఇలా చేయడం వల్ల ఈజీగా మరకలు పోతాయి.

డిష్ వాష్ లిక్విడ్ : డిష్ వాష్ లిక్విడ్ కేవలం గిన్నెలు క్లీన్ చేసేందుకు మాత్రమే కాదు. కిచెన్‌ని మెరిపించేందుకు కూడా పని చేస్తుంది. దీంతో కిచెన్‌ని మెరిపించొచ్చు. ముందుగా స్టౌపై మరకలు ఉంటే స్పాంజ్‌పై కొద్దిగా లిక్విడ్ వేయండి. దీంతో స్టౌని క్లీన్‌గా తోమి కడగండి. ఇలా చేయడం వల్ల స్టౌ క్లీన్ అవుతుంది.

ఉల్లిపాయలతో : ఉల్లిపాయలు ప్రతి ఇళ్ళల్లోనూ ఉంటాయి. వీటిని రుచికి, ఆరోగ్యానికి మాత్రమే కాదు. క్లీనింగ్‌కి కూడా వాడొచ్చని మీకు తెలుసా ఇందుకోసం మీరు ఏం చేయాలంటే కొన్ని ఉల్లిపాయ ముక్కల్ని తీసుకుని 20 నిమిషాల పాటు నీటిలో ఉడికించాలి. ఈ నీటిని కాసేపు చల్లార్చాలి. అదే నీటిని స్ప్రే చేసి ఓ ఐదారు నిమిషాలు ఉంచి చక్కగా క్లీన్ చేయాలి. ఇలా చేయడం వల్ల మరకలు పోతాయి.



# జీవో నెంబర్ 117ను రద్దు చేయాలి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



శ్రీకాకుళం, (విశాఖ సమాచారమ్): కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పాఠశాలల బోధన విధానాన్ని అన్యాయం చేస్తున్న జీవో నెంబర్ 117ను రద్దు చేయాలని ఫ్యాప్టో చైర్మన్ ఎన్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆయన ఈరోజు శ్రీకాకుళం జిల్లా కలెక్టరేట్ ముందు మజ్జి మదన్ మోహన్ అధ్యక్షతన జరిగిన 12 గంటల ఫ్యాప్టో ధర్నాను ప్రారంభించి మాట్లాడారు. అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని, సకాలంలో డిఏలు ఇవ్వటం కానీ, ఉపాధ్యాయుల నియామక ప్రక్రియలు చేపట్టడం కానీ, జరగడంలేదని ఆయన విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించడం విషయంలో ప్రజాస్వామ్య దృక్పథం ప్రభుత్వానికి లేదని ఆయన పేర్కొన్నారు. జీవో నెంబర్ 117 విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నదని, వేలాదిగా ఉపాధ్యాయులు పోస్టులు రద్దు చేస్తున్నారని, 14,202 పాఠశాలలు సింగిల్ టీచర్ తో నడుస్తున్నాయని, ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ వేలాదిగా ఉపాధ్యాయ పోస్టులను రద్దు చేయడం, ఉపాధ్యాయుల మీద ఉక్కు పాదం మోపుతూ నిరంతరం వేధించడం, నిత్య కృత్యంగా మారిందని, ప్రభుత్వ పాఠశాలలు కనుమరుగు కాకముందే ఈ వ్యవస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు అందరికీ ఉన్నదని ఆయన పేర్కొన్నారు.

డిటిఎఫ్ అధ్యక్షులు పేడాడ కృష్ణారావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీ ప్రకారం మాట నిలబెట్టుకుని సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పని తీరు మార్చుకోవాలని, ఉపాధ్యాయులపై వేధింపులు చేయడం తగదని పేర్కొన్నారు. ఎస్ టి యు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకర రావు మాట్లాడుతూ అధికారులు ఉపాధ్యాయులు నిరంతరం వేధింపులకు గురి చేయటం సరికాదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఉపాధ్యాయుల మీదకు నెట్టడం సమంజసం కాదన్నారు. ఏపీటిఎఫ్ 1938 అధ్యక్షులు టెంక చలపతిరావు మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ యూటీఎఫ్ అధ్యక్షులు పొందూరు అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఇంటీరియం రిలీఫ్ ప్రకటించాలని, ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పేర్కొన్నారు. ఎల్ ఎఫ్ ఎల్ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బలివాడ ధనుంజయరావు మాట్లాడుతూ విద్యార్థులను ఆంగ్ల భాషలోనే పరీక్ష రాయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయడం సరికాదని, ప్రభుత్వ పాఠశాలలకు గొడ్డలిపెట్టుగా మారిన జీవో నెంబరు 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, జీవో నెంబర్ 117 న రద్దు చేయాలని, ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్ మొండివైఖరి నశించాలని, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మజ్జి మదన్మోహన్ సెక్రటరీ జనరల్ అప్పలరాజు, ఎస్వీ రమణ, టి చలపతిరావు, పి కృష్ణారావు, హరి ప్రసన్న,మజ్జి మదన్మోహన్, యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎస్ కిషోర్ కుమార్, అధ్యక్షులు పొందూరు అప్పారావు, యూటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్, , ఏపీటీఎఫ్ 1938 ప్రధాన కార్యదర్శి టెంక చలపతిరావు, ఎస్ టి యు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకర్ రావు, , , డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు, ఆప్టా జిల్లా అధ్యక్షులు ఎస్ గోవిందరాజు, తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్ ముకుందరావు, పాపారావు ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు చింతాడ దిలీప్ కుమార్, సిపిఎస్ సంఘం నుంచి కరిమి రాజేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుల సంఘం నుండి వి.సత్యనారాయణ, సన్నసెట్టి రాజశేఖర్, ఎల్. కరుణాకర్, పి.అప్పల నాయుడు, జి.భీమారావు, బి. డిల్లేశ్వరరావు, చావలి శ్రీనివాస్, వెంకుమహంతి నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, డి.వీరయ్య, పి శ్రీరామ్మూర్తి, సదాశివుని శంకర్రావు, ఎన్ శ్రీనివాస్, బి చంద్రశేఖర్, కె. విజయ్ కుమార్, బి అప్పల నాయుడు, కన్వీనర్ తమ్మినేని సూర్యనారా యణ, వై త్రినాధరావు, రామన్నాయుడు, జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తిరుమలలో భక్తుల రద్దీ సాధారణం



శనివారం తిరుమలలో భక్తుల రద్దీ బాగానే ఉంది. శ్రీవారి టోకెన్ రహిత సర్వదర్శనం కోసం 23 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పట్టింది. 72,158 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి హుండీ ఆదాయం 4.08 కోట్ల రూపాయలు వచ్చినట్టు తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. స్వామివారికి 30,735 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### జనసేన వారాహి విజయ యాత్రలో

# స్టీల్‌ప్లాంటు, ప్రభుత్వరంగ ప్రయివేటీకరణపై మాట్లాడాలి

విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ వారాహి విజయయాత్ర పేరుతో విశాఖపట్నం జిల్లాలో సభలు నిర్వహిస్తున్నారు. దీనిని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి స్వాగతిస్తున్నది.

ఈ నెల 10నుండి జరుగుతున్న సభల్లో విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకం గురించి ప్రస్తావించడం లేదు. దీనిపై జెఎసి తమ ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ప్రాణబలి దానం, 64 గ్రామాల రైతులు 24వేల ఎకరాల భూత్యాగాలతో సాధించుకున్న వైజాగ్ స్టీల్‌ప్లాంటును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం స్ట్రాటజిక్ సేల్ పేరుతో అమ్మకానికి పెట్టింది. దీనికి వ్యతిరేకంగా 900 రోజులకు పైగా విశాఖలోను, రాష్ట్రంలోను ఉద్యమం సాగుతోంది. అయినా మోడీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. స్టీల్‌ప్లాంటును ఆర్థికంగా దెబ్బతీసి, కావాలని నష్టాల్లోకి నెట్టి ప్రైవేటీకరించే కుట్రలో వున్నది.

స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరుకు, వర్కింగ్ క్యాపిటల్, రైల్వేరేక్స్, స్వంత గనులు ఇవ్వకుండా, పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరగనీయకుండా ఆటంకాలు సృష్టిస్తోంది. తాజాగా అదానీ గంగవరం పోర్టు నుండి ప్లాంటుకు ఓడల ద్వారా వచ్చే ముడిసరుకు వెళ్లకుండా అడ్డుకుంటోంది.

మరోవైపు రైల్వే, రక్షణరంగం, ఎల్ఐసి, బ్యాంకులు, పోర్టు, బిఎస్ఎన్ఎల్, ఆయిల్ ఇతర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తోంది. ప్రభుత్వరంగసంస్థలకు నిలయమైన విశాఖను, ఆర్థికంగా కేంద్రం దెబ్బతీస్తోంది. విశాఖ ఉత్తరాంధ్ర, రాష్ట్రంలోని యువత ఉపాధిని దారుణంగా హరిస్తోంది. మోడీ ప్రభుత్వం యొక్క ఈ ప్రజా ద్రోహంపై పవన్ కళ్యాణ్ ఇంతవరకు జరిగిన బహిరంగ సభల్లో మాట్లాకపోవడం సరైనది కాదు.

అన్యాయం జరిగిన చోట్ల ప్రశ్నిస్తానన్న జనసేన అధినేత బిజెపి ద్రోహాన్ని నిలదీయాలి. మిగతా సభల్లో పై సమస్యలను ప్రస్తావించి విశాఖ ప్రజలకు, యువతకు, కార్మికలకు భరోసా ఇవ్వాలి. ప్రధానమంత్రి నరేంద్రమోడీ, అమిత్‌షాల వద్ద తనకున్న పలుకుబడితో స్టీల్‌ప్లాంటు అమ్మకం ఆపే ప్రకటన చేయించాలి. స్టీల్‌ప్లాంటుకు స్వంతగనులు సాధించాలి. ప్రభుత్వరంగ పరిరక్షణ ద్వారా ఉత్తరాంధ్ర విశాఖ అభివృద్ధి, యువత ఉపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాము. విశాఖ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన రైల్వే జోన్ ఇవ్వకుండా తాత్సారం చేస్తోన్నది. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్ ఇవ్వాలని కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాం.

అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మిక హక్కులు కాలరాస్తోంది. కార్మికులను అక్రమంగా తొలగిస్తోంది. సంస్థ కోసం తమ సముద్ర వేటను. ఉపాధిని, సర్వస్వం త్యాగం చేసిన మత్స్యకారులను దగా చేస్తున్నది. కార్మికులు న్యాయపోరాటం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తున్నది. కేంద్ర బిజెపి నాయకత్వంతో పవన్ కున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించి, అదానీ గంగవరం పోర్టులో కార్మిక చట్టాలు అమలు చేయించాలని కోరుతున్నారు.

విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి తరపున ఛైర్మన్ ఎం.జగ్గు నాయుడు, వైస్‌చైర్మన్లు పడాల రమణ, బి. నాగభూషణం, కన్వీనర్లు ఎం.వెంకటేశ్వర్లు, ఎన్. కనకారావు, వై.మస్తానప్ప, జెఎసి నాయకులు దొమ్మేటి అప్పారావు, వి. రామ్మోహన్ కుమార్, కె.శంకరావులు ఈ ప్రకటన విడుదల చేయడమైనది.

## 51వార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): విశాఖ ఉత్తర నియోజక వర్గం 51వార్డు సీతన్నగార్డెన్స్, వాటర్ ట్యాంక్ లైన్, లతా మెమోరియల్ స్కూల్ వద్ద 2కోట్ల 47లక్షల 75వేలు రూపాయల వ్యయంతో సీతన్నగార్డెన్స్, మాధవదార వుడా కోలని, కళింగనగర్,మహత్ కోలని ప్రాంతాల్లో బి.టి రోడ్లు, సీసీ రోడ్లు, ఎస్‌డబ్ల్యు డ్రైన్లు నిర్మాణం మరియు పలు అభివృద్ధి పనులు కోసం 51వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకట రమణ ఆధ్వర్యంలో శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా నగర మేయర్ హరివెంకట కుమారి, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు పాల్గొని కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డిఇ భరణి, ఏఈ అర్చన, పైడి ప్రతాప్, తిరుమల రావు, ప్రసన్న రెడ్డి, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, ధర్మావతి, రాణి, అప్పారావు, మోహనరావు, శ్రీను, వినోద్, గణేష్, భాను, గ్రామ పెద్దలు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## మీడియా పేరుతో ఆటో డ్రైవర్ హల్చల్




ఆరిఫ్ ఖాన్ 2020 సంవత్సరంలో ఏపీ సెవెన్ అని ఒక ఐడి కార్డు పెట్టుకుని తన జీవనం కొనసాగించారు. మీడియాలో ఎక్కువ ఆదాయం రానందున, తను ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ శుక్రవారం సాయంత్రం దుర్గగుడి, కనకదుర్గ నగర్ వద్ద కొంతమంది ప్యాసింజర్‌లని అక్కడ దించారు. మీరు లిఫ్ట్‌లో వెళ్లవచ్చని నేను పంపుతాను నేను మీడియా ప్రతినిధినంటూ ఆటోలో వచ్చిన వారిని లిఫ్ట్ వద్దకు పంపే ప్రయత్నం చేశారు, లిఫ్టు వద్ద ఉన్న ప్రోటోకాల్ గురించి అతనికి చెప్పగా నేను మీడియా ప్రతినిధునంటూ అక్కడ ఉన్న మహిళలని నోటికి వచ్చినట్లు వచ్చి బూతులు తిడుతూ అసభ్యకరంగా ప్రవర్తించారని, మహిళలు ఆరోపించారు. పక్కనే ఉన్న సెక్యూరిటీ ఇదే మరి ప్రశ్నించగా నేను ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధినంటూ వారిపై చిందులు వేశాడు. సెక్యూరిటీ అధికారులు అవుట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న పోలీసులు ఆరిఫ్ ఖాన్ వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆరిఫ్ ఖాన్ అనే వ్యక్తి మీడియాలో పని చేస్తున్నట్లయితే ఆ ఐడి కార్డు చూపించమని అడగగా ఎక్స్పైరీ 2020 ఐడీ కార్డు మాత్రమే చూపించారు. ఇది ఈ ఐడి కార్డు డేట్ అయిపోయిందని పోలీసు వారు చెప్పగా 2023 ఐడి కార్డు ఆఫీసులో ఉందని, బ్యాగులో ఉందని నేను అందులో పని చేస్తానని పార్ట్ టైంగా ఆటోడ్రైవర్‌గా ఉద్యోగం చేసుకుంటూ ఉంటారని పోలీసులతో వాగ్వాదానికి దిగాడు.

## తిరుమల శ్రీవారికి ఎన్నిరకాల నైవేద్యాలు సమర్పిస్తారో తెలుసా?



కలియుగ దైవం శ్రీ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామీ గురించి తెలియని చాలా విషయాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా స్వామికి ఎన్ని రకాల ప్రసాదాలను సమర్పిస్తారు. ఏయే సమయాల్లో పెడతారు అనే విషయాన్నీ ఇప్పుడు వివరంగా తెలుసుకుందాము.

బంగారంతో మెరిసిపోయే ఆనంద నిలయంలో కొలువైన స్వామివారు అలంకార ప్రియుడు మాత్రమే కాదు ఆహార ప్రియుడు కూడా. స్వామి వారికి తిరుమల లడ్డూతోపాటూ రకరకాల ఆహార పదార్థాలంటే ఎంతో ఇష్టం. అందుకే రోజా వేంకటేశ్వర స్వామికి సమర్పించే ప్రసాదాలల్లో చాలా రకాలు ఉంటాయి. వాటిని తెలుసుకుందాం.

ఎంతో రుచికరమైన తిరుమల లడ్డూతో పాటు వడ, అప్పాలు సమర్పిస్తారని చాలా మందికి తెలుసు. కానీ ఎక్కువ మంది భక్తులకు తెలియని దోష, జిలేజీ, మురుకు, పోలిలను కూడా స్వామి వారి కోసం ప్రత్యేకంగా తయారు చేసి నివేదిస్తారు. ఇక్కడి లడ్డూ ప్రపంచ వ్యాప్తంగా ఫేమస్. ఇక్కడి లడ్డూలకు ఎంతో డిమాండ్ ఉంటుంది. ఇక్కడ మనకు జిలేబీ, మురుకులు కూడా లభిస్తాయి. వాటి ధరలను టీటీడీ నిర్ణయించింది.

ప్రసాదాల సమర్పణలో టీటీడీ పూర్వం లాగానే వ్యవహరిస్తూ వస్తోంది. శ్రీ భగవత్ రామానుజాచార్యుల వారు నిర్దేశించిన పూజా నియమాల ప్రకారంగానే స్వామి వారికి అన్ని పూజలను చేయిస్తూ వస్తోంది. టీటీడీ ఏ మాత్రం పొరపాటు చేసినా కూడా హిందూ సంఘాలు పెద్ద గొడవ చేస్తున్నారు.

కేవలం గురు, శుక్ర వారాల్లో మాత్రం నైవేద్య సమయాల్లో మార్పులు ఉంటాయి. మిగతా రోజుల్లో మాత్రం ఎటువంటి మార్పు ఉండదు. ఈ విధంగా కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి నైవేద్యాలను అర్చకులు భక్తితో సమర్పిస్తూ వస్తున్నారు.

## ఉద్యోగులు తొలగింపు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): పంచాయితీ రాజ్ శాఖలో 731 మంది టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు చర్య అమానుషమని, వారిని విధుల్లో కొనసాగించాలని ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా సమితి కన్వీనర్ కోన లక్ష్మణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద గత 13 ఏళ్లుగా టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్లుగా ఆయా జిల్లాలలో పని చేస్తున్న 731 మందిని శనివారం నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని, నిధుల కొరత వల్ల తొలగిస్తున్నామని పంచాయతీ రాజ్ లోని ప్రధాన ఇంజినీరింగ్ అధికారి ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఏఐటీయూసీ అనకాపల్లి సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర్వులను వెంటనే ఉప సంహరించుకోవాలని కోరారు. 13 ఏళ్లగా సర్వీసు ఉన్న ఔట్ సోర్సింగ్ సిబ్బందిని నియమ - నిబంధనలు పాటించకుండా ఏపీ సీఓఎస్ నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామికం, చట్టవిరుద్ధమని లక్ష్మణ పేర్కొన్నారు. సమావేశంలో వియ్యపు రమణరావు, మద్దాల. రమణాజీ పాల్గొన్నారు.

## జనసేన దీక్షకు కాంగ్రెస్ నాయకులు ఆర్‌ఆర్ నాయుడు సంఘీభావం



పరవాడ, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో పలు సమస్యలపై జనసేన పార్టీ 10 రోజులు దీక్ష చేపట్టిన శిబిరానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ, ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు ఉమెన్ రైట్స్ ఇన్‌చార్జి ఆర్‌ఆర్ నాయుడు శనివారం చేరుకొని తన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మా కాలుష్యం వలన గాలి, నీరు పూర్తిగా విషపూరితంగా తయారయ్యిందని అన్నారు. 96 ఫార్మా పరిశ్రమల్లో వాతావరణ మార్పులు వలన ఫార్మా వ్యర్థాలతో పాటు విషవాయువు విడిచిపెట్టడం వలన ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని అన్నారు. కొన్ని ఫార్మా పరిశ్రమలు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు యొక్క అనుమతులు లేకుండా మరియు పొల్యూషన్ రెన్యువల్ కాకపోవడం వలన వీటిపై కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వీటన్నిటిపై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్న వెంకటేష్‌కు సంఘీభావం తెలపడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.

## ఓటర్ల జాబితా పక్కాగా ఉండాలి




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పులు, తేడాలు లేకుండా పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఈ ఆర్ ఓలు, బి ఎల్ ఓ లను ఆదేశించారు. శనివారం ఆయన అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాలలో పర్యటించి బూత్ లెవెల్ అధికారులతో సమావేశమయ్యారు. వోటర్ ను చేర్చడం, తొలగించడం లేదా మార్పు చేయడానికి అవసరమైన డాక్యుమెంట్లు తప్పక ఉండాలన్నారు. అర్హత గల ప్రతి ఓటరు నమోదు అవ్వాలన్నారు. నియమ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి అమలు చేయాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి లోను కాకుండా నియమాల ప్రకారం పని చేయాలన్నారు. అనకాపల్లి మండలం నర్సింగబిల్లి సచివాలయం, ఎలమంచిలి పట్టణంలోని నెహ్రూ నగర్ సచివాలయం, బుచ్చయ్య పేట ఎంపీడీవో కార్యాలయాల్లో ఈఆర్వోలతో ఆయన సమావేశమై ఓటర్ల నమోదు ప్రక్రియ ఏ విధంగా చేస్తున్నది తనిఖీ చేశారు. బిఎల్ఓ లను ప్రశ్నలు అడిగి వారికి గల అవగాహన, వారు ఏ విధంగా పనిచేస్తున్నారనేది తెలుసుకున్నారు. వారికి దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఆయా నియోజకవర్గాల ఈఆర్ఓ లయిన ఆర్డిఓ ఏ.చిన్నికృష్ణ, ఎన్ఏఓబి ఎస్డిసి కే.జ్ఞానవేణి, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి ప్రమీల గాంధీ పాల్గొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 50 మందికి పైగా బిఎల్ వో లు హాజరయ్యారు.

## భక్తులతో బయలుదేరిన ఎంవిఆర్ ఉచిత తీర్థయాత్ర వాహనాలు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ప్రముఖ వ్యాపారవేత్త, ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంఘ సేవకుడు ముత్యాల వెంకటేశ్వరరావు (ఎంవిఆర్) ఆధ్వర్యంలో ఉచిత నిత్యతీర్థయాత్రలు జోరుగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు శనివారం మాడుగులు నియోజకవర్గం కె.కోటపాడు మండలంలోని పోతన వలస గ్రామానికి చెందిన భక్తులతో ట్రస్ట్ వాహనం బయలుదేరింది. రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాలైన సింహాచలం, అన్నవరం, కనకమహాలక్ష్మి తదితర ఆలయాల సందర్శనకు భక్తులను సకల సౌకర్యాలతో ఉచితంగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా భక్తులకు ఉదయం ఆల్పాహారం, మధ్యాహ్నం భోజనం సదుపాయం, అదేవిధంగా రాత్రికి అల్పాహారంతో పాటు త్రాగునీరును అందిస్తున్నారు. అలాగే, ఎక్కడికక్కడ తాగు నీటి సదుపాయాలను కూడా ట్రస్ట్ సభ్యులు కల్పిస్తూ భక్తులను దైవ దర్శనానికి తీసుకు వెళ్తున్నారు. అనంతరం, ఎం.వి.ఆర్ సభ్యులు మాడుగుల నియోజకవర్గానికి చెందిన పోతనపాడు గ్రామంలోని పలువురు నాయకులని కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ పిఏ సతీష్ కుమార్ మరియు అనకాపల్లి జిల్లా ఎం.వి.ఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మహాశక్తి పథకంతోనే దళిత మహిళల సాధికారిత సాధ్యం



**అనకాపల్లి పట్టణం, (విశాఖ సమాచారమ్):** 83వ వార్డు, ఏఎంసి కాలనీలో 83వ వార్డు ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్, తెలుగు మహిళ అర్బన్ జిల్లా కార్యదర్శి శంకర్ల పద్మలతలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, టీడీపి వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావుల విగ్ర హాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వీరి ఆధ్వర్యంలో జరిగిన మహాశక్తి పథకం ప్రచార కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ పాల్గొని ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ గవర ఇన్‌చార్జి మళ్ళ సురేంద్ర, రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి, జిల్లా కార్యదర్శి పోలరపు త్రినాథ్, టిఎన్టియుసిజిల్లా ఉపాధ్యక్షులు పిట్ల రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, జిల్లా తెలుగు మహిళ ఆడారి మంజు, రాష్ట్ర శెట్టి బలిజ కమ్యూనిటీ మెంబర్ ఎల్లంకి సత్తిబాబు, రాష్ట్ర వాణిజ్యాల శాఖ కార్యదర్శి సూర సతీష్, పల్లా సత్యం అప్పారావు, నియోజవర్గ టిడిపి మీడియా కో-ఆర్డినేటర్ భానుచందర్, టిఎన్టియుసి నియోజకవర్గ అధ్యక్షులు ఆకుల నానాజీ, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఏపీ సీఎంవోలో ఫేక్ పిటీషన్లు - ఐదుగురిని అరెస్టు చేసిన సీఐడీ!




ఏపీ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ)లో అతి పెద్ద మోసం బయటపడింది. ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయంలోనే కొంతమంది కార్యదర్శుల డిజిటల్ సంతకాలను దుర్వినియోగం చేసిన వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే దీనిపై కేసు నమోదు చేసిన సీఐడీ చురుగ్గా దర్యాప్తు చేస్తోంది.

అవును సాక్ష్యాత్తు ముఖ్యమంత్రి కార్యాలయంలో డిజిటల్ సంతకాల మోసం వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వివరాలను సీఐడీ సైబర్ క్రైమ్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితుల్ని అరెస్టు చేసినట్లు ఆయన ప్రకటించారు.

ఈ విషయంపై సీఎంవో అధికారుల నుంచి వచ్చిన ఫిర్యాదుతో ఏపీ సీఐడీ కేసు నమోదు చేసింది. సీఎంవోలో రేవు ముత్యాల రాజు, ధనుంజయ్ రెడ్డి, సీఎస్ జవహర్ రెడ్డి పేషీల్లో పనిచేస్తున్న కొందరు డిజిటల్ సంతకాలు దుర్వినియోగం చేశారని తెలుస్తోంది. ఈ కేసులో అరెస్టు చేసినట్లు సీఐడీ ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు.

వివరాల్లోకి వెళ్తే గత కొన్ని నెలలుగా సీఎంవోలో ఉన్న కార్యదర్శుల ఈ-ఆఫీస్ లాగిన్ యూసర్ నేమ్, పాస్ వర్డ్‌లను వినియోగించి ఎమ్మెల్యే, ఎంపీల అభ్యర్థనలను సీఎంవో కార్యదర్శులకు తెలియకుండా సీఎం పిటిషన్లు తయారీ చేస్తున్నారట. వీటిని సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు.

ఇదే సమయంలో సీఎం పిటిషన్లను ఏ శాఖకు కావాలంటే ఆ శాఖ సెక్రెటరీ టు సీఎం సంతకాలను కాపీ, పేస్ట్ చేసి పంపించేవారట. ఇలా చేసేందుకు డబ్బులు తీసుకుని వీళ్లంతా పంచుకునేవారట. ఈ క్రమంలో ఫిబ్రవరి నెలలో ఇలాగే ఒక పిటిషన్ రాగా, అనుమానంతో క్రాస్ చెక్ చేసి, శాఖపరమైన విచారణ చేసి నిర్ధారించుకుని మొదటి ముద్దాయిని ఉద్యోగం నుంచి తొలగించారట. ఈ సమయంలో మిగిలిన కార్యదర్శులు వారి శాఖలలోని లాగిన్స్ చెక్ చేసుకోగా సుమారు 66 సీఎంపీలు ఫేక్ అని గుర్తించారట.

దీంతో రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు ఐదుగురు నిందితులను గుర్తించారు. ఫైల్ ప్రాసెసింగ్‌కి వీళ్ల మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించామని సీఐడీ ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. వీళ్లు ఒక్కొక్క ఫైల్ ప్రాసెస్ చేయడానికి రూ.30 వేలు నుంచి 50 వేలు వరకు వసూలు చేసినట్లు చెబుతున్నారు.

తాజాగా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ నేరానికి పాల్పడినట్లు నిందితులు ఒప్పుకోవడంతో వీళ్లని కస్టడీలోకి తీసుకుని, జుడీషియల్ రిమాండ్‌కి తరలిస్తామని సీఐడీ ఎస్పీ తెలిపారు.

అరెస్టు చేసిన ఐదుగురు కనమర్ల శ్రీను (ముత్యాల రాజు పేషీలో మాజీ డీఈఓ), నలజల సాయి రామ్ (జవహర్ రెడ్డి పేషీలో డీఈవో), గుత్తుల సీతారామయ్య (ధనుంజయ రెడ్డి పేషీలో అటెండర్), చైతన్య (ముత్యాలరాజు పేషి), అబ్దుల్ రజాక్ (జవహర్ రెడ్డి పేషీలో డీఈవో) అని తెలిపారు.

## డైట్‌లో 'నేక్' సెమినార్ సర్టిఫికెట్స్ ప్రదానం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చైర్మన్ దాడి రత్నాకర్ ఈ రెండు రోజుల నేక్ సెమినార్ ప్రాయోజిత సెమినార్ నిర్వాహకులందరినీ అభినందించారు. సెమినార్లు, వర్క్ షాప్, కాన్ఫరెన్స్ ల్ వంటి ప్రయోజనకరమైన కార్యక్రమాలను నిర్వహించడానికి అన్ని చట్టబద్ధమైన సంస్థలను దరఖాస్తు చేసుకోవాలని హెచ్ ఓ డి లతో పాటు ఫ్యాకల్టీ సభ్యులకు సర్టిఫికెట్స్ అందజేశారు .జాతీయ విద్యా విధానం మరియు దాని ఫలితాల ఆధారిత విద్యా విధానం అనే అంశంపై రెండవ రోజు ప్రధాన వక్త డాక్టర్ చల్లా నరసింహం, ఆంధ్రా యూనివర్సిటీ అనుబంధ ప్రొఫెసర్‌తో సెమినార్ ప్రారంభమైంది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ యొక్క ప్రధాన లక్ష్యాలు మల్టీ డిసిప్లినరీ విద్య, మాతృభాష బోధనా మాధ్యమం, వృత్తి విద్య మరియు డిజిటల్ విద్యను కలిగి ఉన్నాయని మరియు ఇది ప్రధానంగా యాక్సెస్, ఈక్విటీ, నాణ్యత, స్థోమత మరియు జవాబుదారీతనం అనే 5 స్తంభాలపై ఆధారపడి ఉందని ఆయన అన్నారు. యాక్సెస్- కులం, మతం, స్థానం లేదా లింగంతో సంబంధం లేకుండా పిల్లలందరికీ పొల్చదగిన నాణ్యమైన ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఉండాలి. పాఠశాల పాఠ్యాంశాలను తగ్గించడం మరియు విశ్లేషణాత్మక మరియు విమర్శనాత్మక ఆలోచన, అనుభవపూర్వక అభ్యాసం మరియు సృజనాత్మకత వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థులకు సంపూర్ణమైన మరియు సౌకర్యవంతమైన అభ్యాస అనుభవాన్ని అందించడం దీని లక్ష్యం.

అనంతరం రెండవ వక్త, ప్రిన్సిపాల్ డాక్టర్.ఆర్.వైకుంటరావు "ఇంజనీరింగ్ బోధనలో పెడగోగికల్ మెథడ్స్" అనే అంశంపై జరిగిన సెమినార్లో ప్రసంగించారు. బోధన యొక్క సిద్ధాంతం మరియు అభ్యాసం, బోధనా శాస్త్రం నిర్దిష్ట లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని నిర్దిష్ట పాఠ్యాంశాలను ఉపయోగించి బోధన మరియు అభ్యాసానికి బోధకులు ఎలా చేరుకుంటారనే పద్ధతి మరియు ప్రక్రియను సూచించడమే కాకుండా ఇది అభ్యాసకులలో గుప్త నైపుణ్యాలను అన్వేషిస్తుందని ఆయన అన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు బోధించే ప్రతి అధ్యాపకులకు అత్యంత ముఖ్యమైన బోధనా పద్ధతుల యొక్క ప్రాముఖ్యతను వెలుగులోకి తీసుకురావడమే తన అంశం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇంజనీరింగ్ బోధనా శాస్త్రం యొక్క ఈ దృక్పథం యొక్క దృష్టి ఉత్పత్తి మరియు సేవ యొక్క నిర్మాణాలను మార్చడంలో వారి నాయకత్వ పాత్రల కోసం భవిష్యత్ ఇంజనీర్ల తయారీకి సంబంధించిన బోధనా భావనలను అభివృద్ధి చేయడం అని ఆయన అన్నారు మరియు అతను మన కాలంలోని కమ్యూనికేషన్ల రకాలు, స్థాయిలు మరియు అంశాలను చాలా సూక్ష్మంగా వివరించాడు.

మూడవ వక్తగా సిఎస్ఇ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి డాక్టర్ కె సుజాత "రివైజ్డ్ అక్రిడిటేషన్ ఫ్రేమ్వర్క్ ఆన్లైన్ ఎ అండ్ ఎ (అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్) మెథడాలజీ" అనే అంశంపై ఉపన్యాసం ఇచ్చారు. నేక్ ప్రారంభమైనప్పటి నుండి రెండు దశాబ్దాలగా, ఉన్నత విద్యలో మారుతున్న పోకడలు మరియు సంస్కరణలను సమలే ఖనం చేయడం మరియు ఇంజనీరింగ్ విద్యను నేర్చుకునే ప్రతి విద్యార్థికి ప్రయోజనం చేకూర్చే విధంగా ప్రపంచ విద్యా దృష్టాంతాన్ని వేగంగా మార్చడం ఆధారంగా దాని పద్ధతిని సవరించడంలో నేక్ ఎంత కష్టపడి మరియు నిరంతరంగా కృషి చేస్తుందో ఆమె అన్నారు.

## 'రాజద్రోహం' పై జ్ఞానోదయం అయ్యిందా ?



బాగా దుర్వినియోగం అవుతున్న చట్టాల్లో రాజద్రోహం చట్టం ముందుంటుంది. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఎవరేమి మాట్లాడినా పాలకులకు ముందుగా గుర్తుకొచ్చేది రాజద్రోహం చట్టమే. గడచిన పదేళ్ళుగా దేశవ్యాప్తంగా కొన్ని వేలమందిపైన ప్రభుత్వాలు రాజద్రోహం కేసులు నమోదు చేసుంటాయనటంలో సందేహం లేదు.

రాజద్రోహం కేసులు నమోదు చేయటంలో కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడుతున్నాయి. హక్కుల కోసం పోరాటం చేస్తున్న వాళ్ళపైన, ప్రభుత్వానికి వ్యతిరేకంగ మాట్లాడుతున్న వాళ్ళపైన, ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్న వాళ్ళపైన కూడా ప్రభుత్వాలు రాజద్రోహం కేసులు నమోదు చేస్తున్నాయి.

ఈ తరహా కేసులు బాగా నమోదవుతుండటంతో కోర్టులు కూడా సీరియస్ అయిన సందర్భాలు చాలా ఉన్నాయి. రాజద్రోహం కింద కేసు నమోదుచేస్తే వెంటనే సదరు వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టి రిమాండుకు పంపేస్తున్నారు. ఈ కేసులో అరెస్టయితే బెయిల్ దొరకటం కూడా కష్టంగానే ఉంటోంది. ఇదే విషయమై కొందరు వివిధ హైకోర్టుల్లోను, సుప్రీంకోర్టులో కూడా కేసులు వేశారు. దాంతో కేసులపై విచారించిన సుప్రీంకోర్టు రాజద్రోహం కేసును ఎవరిపైనా నమోదు చేయద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

అయితే ఏ ప్రభుత్వమూ సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్క చేయలేదు. మొత్తానికి కేంద్రప్రభుత్వం ఏమనుకున్నదో ఏమో రాజద్రోహం చట్టాన్ని రద్దు చేసేసింది. నిజానికి రాజద్రోహం చట్టాన్ని బ్రిటీష్ పాలకులు తీసుకొచ్చారు. అప్పట్లో వాళ్ళ ఉద్దేశ్యం ఏమిటంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వాళ్ళని శిక్షించటమే కానీ వాళ్ళకు న్యాయంచేయటంకాదు. బ్రిటీష్ వాళ్ళు వెళ్ళిపోయినా వాళ్ళు తయారుచేసిన చట్టాలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి.

ఇదే విషయాన్ని గతంలోనే సుప్రీంకోర్టు చెప్పి చట్టాలను ప్రస్తుత కాలానికి తగ్గట్లుగా మార్పు చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందులో భాగంగానే రాజద్రోహం చట్టాన్ని ఎవరిపైనా నమోదు చేయద్దని చెప్పింది. అయితే అప్పట్లో సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇంత సడెన్‌గా రాజద్రోహం చట్టాన్ని రద్దుచేసింది. ఏదేమైనా రాజద్రోహం చట్టం రద్దవటం సంతోషమే కదా.

## ఘనంగా ఎఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** యలమంచిలి ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహంలో శనివారం నాడు ఎఐఎస్ఎఫ్ అవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షలు బాబ్జి ఆధ్వర్యంలో రిటైర్డ్ టీచర్, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు సన్యాసిరావు ముఖ్య అతిథిగా జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురిటి పాతేళ్లలో నుంచే ఉద్యమాలు చేపట్టిన ఘనత ఒక ఏఐఎస్ఎఫ్ దేనని ఉద్యమాలలో ఉద్భవించి, పోరాటాలలో రాటుదేలి సామ్యవాద సమాజ స్థాపన కోసం అవిరళ త్యాగాలతో ఉద్యమాన్ని నిర్మిస్తున్న ఏకైక విద్యార్థి సంఘం అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ (ఎ ఐ ఎస్ ఎఫ్) స్వాతంత్రం మా జన్మహక్కని భారతజాతి ఎలుగెత్తి నినాదిస్తున్న తరుణంలో పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి 1936 ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించిందని తెలిపారు. విద్యార్థి ఉద్యమాల నిర్మాణంలో నిమగ్నమైన అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ 87 సంవత్సరాలు పూర్తిచేసుకుని 88 వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా విద్యార్థి నాయకులకు, మాజీ నాయకులకు, మిత్రులకు , శ్రేయోభిలాషులకు వారు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోటీలలో విజేతలైన విద్యార్థులకు వారి చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ నాయకులు హరికృష్ణ, నాయుడు, వరహాలు, అభి తదితరులు పాల్గొన్నారు.

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై స్పందించేందుకు ఎంపీ ఎంవీవీ నో!

తనపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలపై స్పందించేందుకు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ నిరాకరించారు. పవన్ చేసిన వ్యాఖ్యలపై ఏం చెబుతారని మీడియా ప్రశ్నించగా ఆయన వ్యాఖ్యలపై స్పందించనని స్పష్టం చేశారు. అంతకుముందు, ఎంపీ ఎంవీవీపై జనసేనాని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేసిన వారితో ఎంపీ ఎంవీవీ ములాఖత్ అయ్యారని పవన్ కల్యాణ్ ఆరోపించారు. అలాంటి ముఠాలతో వైసీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు దందాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. డబ్బులతో గెలిచిన నాయకులు ఇలాగే దద్దమ్మల్లాగా ఉంటారన్నారు. ఈ వ్యవహారం ఎంపీ ఎంవీవీ ఇంటికి మాత్రమే పరిమితం కాదని, కాబట్టి తాను దీనిని కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లానన్నారు.

## తిరుపతి, సికింద్రాబాద్, భువనేశ్వర్, విశాఖపట్నం వారికి ముఖ్య గమనిక



పాఠశాలలు, కళాశాలలు తెరుచుకోవడంతోపాటు వర్షాకాలం సీజన్ కావడంతో భారతీయ రైళ్లల్లో రద్దీ పెరుగుతోంది. ఈ రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. సికింద్రాబాద్ నుంచి తిరుపతి, భుశనేశ్వర్‌కు రెండురోజులపాటు రైళ్లను నడిపించనుంది.

నెంబర్ 07490 (సికింద్రాబాద్ - తిరుపతి) తిరుపతిలో 12వ తేదీ సాయంత్రం 4.35 గంటలకు బయలుదేరి 13వతేదీ తెల్లవారుజామున 4.50 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. కాచిగూడ, ఉమ్దానగర్, షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్, వనపర్తి రోడ్, గద్వాల్, రాయచూర్, మంత్రాలయం రోడ్, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతుంది.

నెంబరు 07059 (భువనేశ్వర్ - సికింద్రాబాద్) 11వ తేదీ మధ్యాహ్నం 3.05 గంటలకు భువనేశ్వర్ లో బయలుదేరి 13వ తేదీ తెల్లవారుజామున 3.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, విశాఖపట్నం, విజయగనరం, శ్రీకాకుళం రోడ్, పలాస, ఇచ్ఛాపురం, బెర్హంపూర్, బలుగాన్, ఖుర్దారోడ్ స్టేషన్లలో ఆగుతుంది.

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రయాణికులకు అధునాతన సౌకర్యాలు కల్పించేందుకు భారతీయ రైల్వే నిరంతరం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే సెమీ హైస్పీడ్ రైలైన వందే భారత్ ను ప్రవేశపెట్టింది. జనతాఖానా పేరుతో రైళ్లల్లోని జనరల్ బోగీల్లో ప్రయాణించేవారికి రూ.20కే భోజనాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రయోగాత్మకంగా 4 స్టేషన్లలో దీన్ని అమలు చేస్తున్నారు.

## పాస్టర్స్ ఫెలోషిప్ మరియు ఐక్య వేదిక ఆధ్వర్యంలో శాంతి ర్యాలీకి సంపూర్ణ మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ




**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** శనివారం కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీ మణిపూర్ రాష్ట్రంలో అధికారంలోఉన్న బిజెపి పార్టీ ఆ రాష్ట్రంలో మతాకలహాలు సృష్టించి మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసులపై అత్యాచారము. దమన కాండ ధన.మాన ప్రాణాలు. మరణ హింసలు జరుగుతున్నందున నిరసనగా అరకు వ్యాలీ మండల కేంద్రంలో ఎన్టీఆర్ గ్రౌండ్ నుండి మండల తాసిల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నుండి సంపూర్ణ మద్దతు ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ కాంగ్రెస్ పార్టీ ఆదివాసి కాంగ్రెస్ చైర్ పర్సన్ శ్రీమతి పాచిపెంట శాంత కుమారి మాట్లాడుతూ ప్రపంచ దేశాలన్నీ కూడా ఈ సంఘటనని ముక్తకంఠంతో ఖండిస్తుంది కానీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి పార్టీ. జనసేన పార్టీ. పవన్ కళ్యాణ్ గారు మరియు గౌరవ జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైసీపీ పార్టీ నాయకులు. అన్యాయాన్ని ఖండించకపోవడం దీనిమీద చిత్తశుద్ధి లేకపోవడం చాలా దుర్మార్గము ఆదివాసీ మహిళలు అంటే భారతదేశ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారికి మరియు బిజెపి పార్టీకి చాలా చులకన అని ఆవేదన చెందారు. హిందువులకు మరియు క్రైస్తవులకు మతా కలహాలు సృష్టించి. అక్కడ ఉన్న మందిరాలను చర్చిలను ధ్వంసం చేసి ఆదివాసులకు సుమారుగా 300 మంది ప్రాణాలు బలి కొన్నారు ఆదివాసులకు ఇంత అన్యాయం జరుగుతుంటే అక్కడ ఉన్నటువంటి బిజెపి పార్టీ ముఖ్యమంత్రి మరియు మంత్రులు అధికారులు పోలీసు యంత్రాంగం చూసి చూడనట్టు ఉండడం చాలా దుర్మార్గమని మణిపూర్ లో ఉన్న మణిహారాలు వజ్రాలు అక్కడున్న సంపాదన బడా బాబులకు ఆధాని. అంబానీలకు. కట్ట.బెట్టే ప్రయత్నంలో భాగంగానే అక్కడ మతాకళాలు సృష్టించి మరణ హెూమానికి ఆ రాష్ట్రము పాల్పడింది. ఆదివాసులకు వ్యతిరేకమైన బిజెపి పార్టీకి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న వైసిపి పార్టీ టిడిపి పార్టీ జనసేన పార్టీ కేంద్రంలో ఉన్న బిజెపి పార్టీకి మద్దతు.ఉ పసమరించుకోవాలని అదేవిధంగా అక్కడ జరిగిన అన్యాయాన్ని మానవ మృగాలకు తక్షణమే ఉరితీయాలని మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసుల చర్చిలను ధ్వంసం చేసినది పునర్నిర్మాణం తక్షణమే చేసి ఇవ్వాలని మరియు మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నుండి డిమాండ్ చేస్తున్నాము ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ ఆదివాసి విభాగం కోఆర్డినేటర్ తెలగంజి సోమేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జంపరంగి వెంకట్ బాబు, పాచిపెంట చిన్నస్వామి శెట్టి భగత్ రాం, తెడబారికి భీమారావు, ఖాన్ గుల్సన్, కొర్రమితుల పాంగి గంగాధర్ పాల్గొన్నారు.

# ఆ ఎమ్మెల్యేకి ఇక జైలేనా?



### అప్పీల్‌కు వెళ్తానన్న ఎమ్మెల్యే ఆస్తికరంగా విశాఖ రాజకీయాలు!

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆయన ఎమ్మెల్యే కాక ముందు ఒక వ్యక్తి పై దాడి చేసిన కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటూ వచ్చారు. దాదాపు 15 ఏళ్ల విచారణ అనంతరం ఆయనకు జైలు శిక్ష పడింది. ఆ సమయానికి ఆయన ఎమ్మెల్యే కూడా అయిపోయారు. కోర్టు లో తనను క్షమించి శిక్ష వేయిద్దంటూ వేడుకున్నా జడ్జ్ మాత్రం కేసు మెరిట్స్ పైనే వెళ్తున్నట్టు స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించారు. 5 వేల రూపాయల జరిమానా కూడా విధించింది ధర్మాసనం. విశాఖ సౌత్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు ఓ దాడి కేసుకు సంబంధించి ఆయనకు ఆరు నెలల సాధారణ జైలుశిక్ష విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. 6 నెలల జైలుశిక్షతో పాటు 5 వేల రూపాయల జరిమానా విధిస్తూ విశాఖ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు నిర్ణయం తీసుకుంది. అయితే క్రింది కోర్టు తీర్పును వాసుపల్లి గణేష్‌కు హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు తెలిపారు.

**2006 లో దాడి కేసు నమోదు**

2006 నుంచి విశాఖపట్నానికి చెందిన రామచంద్రారెడ్డి, దుర్గారెడ్డి మధ్య ఆస్తి వివాదాలు ఉన్నాయి. ఈ ఆస్తులకు సంబంధించి గొడవలు జరుగుతున్న సమయంలో కొట్లాటలు కూడా జరిగాయి. 2008 అక్టోబర్ 29న ఆస్తి విబేధాల విషయంలో రామచంద్రారెడ్డిపై వాసుపల్లి గణేష్, దుర్గారెడ్డి ఇద్దరూ కలిసి దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో తనపై దాడి చేశారంటూ వాసుపల్లి, దుర్గారెడ్డిపై పోలీస్ స్టేషన్ దాకా వ్యవహారం వెళ్ళింది. కేసు నమోదైంది. కోర్టుల్లో కూడా కేసులు నడుస్తున్నాయి. దాడి సమయంలో తాను అక్కడ లేనని, అసలు ఆ దాడికి నాకు సంబంధం లేదని వాసుపల్లి గణేష్ చెబుతున్నప్పటికీ, ప్రాసిక్యూషన్ మాత్రం దాడిలో ఉన్నట్లు రుజువు కావడంతో వాసుపల్లి గణేష్‌తో పాటు దుర్గారెడ్డికి శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించారు.

**అప్పీల్‌కు వెళ్ళాలని నిర్ణయం**

ఈ కేసులో శిక్ష వేయకుండా జరిమానాతో సరిపెట్టమని ఎమ్మెల్యే వాసుపల్లి జడ్జిని ప్రాధేయపడ్డారు. అయితే ఈ అభ్యర్థనను న్యాయమూర్తి తిరస్కరించారు. వాసుపల్లితో పాటు ఏ 1 గా వున్న ప్రధాన ముద్దాయి బోరా దుర్గారెడ్డికి కూడా ఆరు నెలల జైలును కోర్ట్ విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా రెండు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కూడా కోర్టు వెల్లడించింది. దీంతో పై కోర్టు కు అప్పీల్ కు వెళ్లనున్నట్లు ఎమ్మెల్యే టీవీ9 కి తెలిపారు. కాగా, 2019 లో టీడీపీ నుంచి గెలిచిన వాసుపల్లి గణేష్ ఆ తర్వాత వైసీపీలో చేరిన విషయం తెలిసిందే.

# ఉపమాక వెంకన్నకు ప్రత్యేక పూజలు

### 1000 మందికి అన్నదానం



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** అధిక శ్రావణమాసం బహుళ ఏకాదశితో కూడిన శనివారం కావడంతో నక్కపల్లి మండలంలోని ఉపమాక ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, దాతల సహకారంతో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పిల్లలు, వృద్ధులు, అనేక మంది భక్తులో ఎంతో సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శనివారం నాడు ఆలయ ప్రాంగణం వద్ద 1000 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కొండపై వున్న స్వామివారి నిజరూపానికి అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేసి, పుష్పాలంకరణ చేశారు. కింద ఆలయంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు పీసపాటి శేషాచార్యులు, భాగవతం సాయి గోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు.

ఉపమాక ఆలయాన్ని సీఐ జీఎన్ అప్పన్న కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తుల గోవింద నామస్మరణతో ఆలయం మార్మోగింది.

# అరెస్టయి విడుదలైన వంగలపూడి అనిత



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట మాజీ శాసన సభ్యురాలు వంగలపూడి అనితను ఎలమంచిలి వద్ద పోలీసులు అరెస్టు చేశారు. పొంగు నురి సమస్యకు తనకు సంబంధం ఏమిటి అని ఆమె పోలీసులను ప్రశ్నించారు. మహిళ అని చూడకుండా తనను రెండు గంటల సేపు కారులోనే నిర్బంధించారని ఆమె వాపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేదా అని ప్రశ్నించ్చారు. రాక్షస పాలన నడుస్తోంది అని, ప్రశ్నించే హక్కులును కాలరాస్తున్నారని ఆమె అన్నారు. పాయకరావుపేట ఎన్ హెచ్ 16 రహదారి నుంచి గౌతమ్ థియేటర్ వరకు వెళ్ళే రోడ్డును అంత అర్జెంటుగా మొదలుపెట్టి శంకుస్థాపన చేయడం ఏమిటని ప్రశ్నించా రు. సింగిల్ రోడ్డు కాకుండా డబుల్ రోడ్డు వేస్తే ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆమె తన అనుచరులతో సహా ప్రశ్నించడానికి బయలుదేరారు.

ఈ రోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఆమె తన సహచరులతో వచ్చి అడ్డుతగులుతారనే సమాచారం అందడంతో ముందస్తు చర్యగా ఆమెను నక్కపల్లి టోల్‌గేట్ వద్ద రెండు గంటల పాటు నిర్బంధించి, తరువాత పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్ళి కొంత సేపటి తరువాత విడుదల చేశారు.




శ్వాసకోశ వ్యాధులకు ఉపశమనం

- 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
- మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

కార్డోరియం ప్లస్




కావల్సిన వారు సంప్రదించండి:

9393949347

మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను ధృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్‌నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్‌షిప్ కొరకు సంప్రదించండి.స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.

మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.

అందరూ ఆరోగ్యంగా ఉండండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179

Compli

# గ్రావెల్ మాఫియాతో అధికార యంత్రాంగం లాలూచీ

## పెదముషిడివాడలో ఆగని గ్రావెల్ తవ్వకాలు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పెదముషిడివాడలో అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు ఆగడం లేదు. గ్రావెల్ మాఫియాతో అధికార యంత్రాంగం లాలూచీ పడడంతో నిత్యం రాత్రివేళల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి, గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. స్థానిక గ్రావెల్ మాఫియానే ఇటువంటి దురాగతాలకు పాల్పడుతోంది. ఇందులో భాగంగా సర్వే నెంబర్ 409లో రెండ్రోజులుగా పెద్ద మొత్తంలో గ్రావెల్ తరలి పోయింది. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించుకుపోతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత మూడున్నరేళ్లుగా అక్రమ మైనింగ్ జరుగుతూనే ఉన్నప్పటికీ ఏ అధికారి పట్టించుకున్న దాఖలాలు కనిపించలేదు.

రెవెన్యూ, మైనింగ్, పోలీస్ సంబంధిత శాఖాధికారులకు పిర్యాదులు వెళ్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటు స్పందనలోనూ పిర్యాదులు ఉన్నాయి. అయినా గ్రావెల్ మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడలేదు. కోట్లు విలువ చేసే గ్రావెల్ మట్టి అక్రమంగా తరలిపోయింది. ఇంకా తరలిపోతూనే ఉంది. అధికార యంత్రాంగం గ్రావెల్ మాఫియా పై చర్యలు కానరావడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

# ఓటరు జాబితాతో ఇంటింటికీ బిఎల్‌వోలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే ప్రక్రియ త్వరతగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాధన్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. శనివారం ఉదయం భీమిలి మరియు విశాఖ తూర్పు శాసన సభా నియోజక వర్గాల పరిదిలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యాక్రమంలో జాయింట్ కలెక్టరు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ భార్యాభర్తలు వివిధ పోలింగ్ స్టేషన్లో ఓటరుగా నమోదయి ఉన్నా లేదా ఓటర్ల జాబితాలో చేర్చకపోయినా, 18 సంవత్సరాలు నిండి ఓటరుగా నమోదు కాకపోయిన బియల్‌ఓ వారి ఇంటిని సందర్శించినప్పుడు క్షుణ్ణంగా తనిఖీ చేసుకొని, ఏమైన సవరణ ఉన్నచో అటువంటి వారికి బియల్‌ఓ తగు ఫారం ఇచ్చి ఓటరు జాబితాను సరి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డీఓ బాస్కర్ రెడ్డి, స్టీల్ ప్లాంట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, భీమిలి మరియు విశాఖ రూరల్ తహశిల్దార్లు, బియల్‌ఒలు, తదితరులు పాల్గొన్నారు.

క్లాసిఫైడ్స్, ప్రకటనల కొరకు సంప్రదించండి
8885687610,
7981904385




# బాబుమోహన్, బాలయ్యలు కనిపించడంలేదు

## ఆందోళనలో బీజేపీ క్యాడర్




**సంగారెడ్డి:** తెలంగాణ వ్యాప్తంగా దూసుకుపోవాలని కమలం పార్టీ పెద్దలు ఇప్పటికే నేతలకు సూచనలు చేశారు. దీంతో బీజేపీలోని పెద్ద నేతలంతా ఆ ఆలోచనతో ముందుకు వెళ్తుంటే ఆ నియోజకవర్గ బీజేపీ నేతలు మాత్రం చాలా సైలెంట్ అయ్యారట. గత కొద్దిరోజుల క్రితం హడావుడి చేసిన నేతలు, ఇప్పుడు అసలు నియోజకవర్గాన్ని పట్టించుకోవడమే లేదట. దీంతో అక్కడ బీజేపీ పార్టీ ఉందా లేదా అనే అనుమానాలు వస్తున్నాయని టాక్ వినిపిస్తోంది. ఇంతకి అది ఏ నియోజకవర్గం? ఎవరా నేత? అనే వివరాలు తెలుసుకోండి. సంగారెడ్డి ఆందోల్-జోగిపేట నియోజకవర్గంలోని కమలం పార్టీకి అర్జెంట్‌గా లీడర్లు కావాలంట గత కొద్దిరోజులుగా పార్టీని నడిపే లీడర్లు లేకపోవడంతో కార్యకర్తలందరూ నైరాశ్యంలో ఉన్నారట. ఆందోల్-జోగిపేట బీజేపీ పార్టీలో లీడర్లు లేరా అంటే గట్టి నేతలే ఉన్నారు.. కానీ, ఈ మధ్య కాలంలో నియోజకవర్గన్ని అసలు పట్టించుకోవడం లేదట. ఒకప్పుడు నాయకత్వం కోసం కొట్టుకున్న లీడర్లు ఇప్పుడు అస్సలు పార్టీని పట్టించుకోవడం లేదని టాక్ వినిపిస్తోంది. ఆందోల్ నియోజకవర్గ బీజేపీలో సీనియర్ లీడర్ బాబుమోహన్ ఈయన నియోజకవర్గంలో కనిపించక చాలా రోజులైందట. అందోల్ బీజేపీ నేతలకు టచ్‌లో కూడా లేరని బహిరంగంగా పేర్కొంటున్నారు బీజేపీ నేతలు.

ఆందోల్ బాబూ మోహన్‌తో పాటు మరో నేత ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ బాలయ్య. వీరిద్దరు అందోల్ బీజేపీలో సీనియర్ లీడర్లు ఇప్పుడు వీరిద్దరు పార్టీని పట్టించుకోవడం లేదని సొంత పార్టీ క్యాడరే పేర్కొంటుండం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మొదట నియోజకవర్గ పరిధిలో బాబుమోహన్ బాగానే తిరిగేవారు అయితే అదే సమయంలో బాలయ్య బీజేపీ పార్టీలోకి రావడంతో ఇద్దరి మద్య గొడవలు అయ్యాయట. ఏ కార్యక్రమం చేసిన ఎవరికి వారే చేసేవారట అలాంటి నేతలు ఇప్పుడు నియోజక వర్గంలో కన్పిస్తాలేరని పేర్కొంటున్నారు. వీరిద్దరి తీరు ఉంటే ఉగాది లేకుంటే శివరాత్రి అన్నట్లుగా మారిందట ఒకప్పుడు ఆధిపత్యం కోసం కొట్టుకున్న ఈ ఇద్దరు నేతలు.. ఇప్పుడు ఉన్న అవకాశాన్ని కూడా చేజార్చుకుంటున్నట్లు తెలుస్తోంది.


నియోజకవర్గ పరిధిలో ఉన్న బీజేపీ కార్యకర్తలను ముందుకు నడిపే లీడర్లు లేకపోవడంతో వాళ్ళు కూడా తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారట.. ఇటీవల కాలంలో బీజేపీ అధినాయకత్వం ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చిన కూడా అందోల్-జోగిపేట్ నియోజకవర్గ పరిధిలోని జరగడం లేదట. మొన్నటికి మొన్న బీజేపీ టిఫిన్ కార్యక్రమం నిర్వహించినప్పుడు కూడా ఉమ్మడి జిల్లాలో అన్ని నియోజక వర్గాల్లో జరిగాయి.. కానీ అందోల్-జోగిపేట్ లో మాత్రం టిఫిన్ బైటో కార్యక్రమం జరగలేదట.. అధికార పార్టీపై నిరసన కార్యక్రమాలు చేయడానికి కూడా ఈ లీడర్లు రావడం లేదని సొంత క్యాడరే విమర్శిస్తుండటం ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది.

ఇతర ప్రతిపక్ష నేతలు అధికార పార్టీపై నిరసనలు తెలుపుతూ ఏదో ఒక కార్యక్రమం చేస్తుంటే.. బీజేపీ మాత్రం ఏం చేయలేదంటూ సొంత కార్యకర్తలు చెబుతుతుండటం చర్చనీయాంశంగా మారింది. పార్టీ కోసం పనిచేసే క్యాడర్ ఉన్న కూడా వారికి దిశ నిర్ధేశం చేసే నేతలు కరువైనరని ఆందోల్ బీజేపీలో ఆందోళన మొదలైంది. గతంలో ఓకే పార్టీలో ఉన్నప్పటికీ బాబుమోహన్, బాలయ్యకి ఇద్దరికి పడక ఎప్పుడూ ఏదో ఒక గొడవ పెట్టుకునేవారు.. ఆ సమయంలో ఎవరి వైపు ఉండాలో అర్థం కాక అగమయ్యాము.. ఇప్పుడు దిశానిర్దేశం చేసే లీడర్ లేక ఇలా ఆగం అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట అందోల్ బీజేపీ క్యాడర్ బాబు మోహన్ లాంటి సినియర్ లీడర్ కూడా పార్టీని పట్టించుకొకపోతే ముున్ముందు ఎలా అని కార్యకర్తలు బహిరంగంగా పేర్కొంటున్నారు. బాలయ్య ఎంట్రీ బాబుమోహన్‌కి ఇష్టం లేదు అయిన సరే కొద్దీరోజులు ఇద్దరు ఎవరికి వారు నియోజకవర్గ పర్యటనలు చేశారు. కానీ ఒకేసారి ఇద్దరూ కూడా నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం మరోవైపు ఎన్నికలు దగ్గర పడుతుండటం పార్టీ క్యాడర్లో అయోమయం నెలకొంది.

# వీధుల్లో పర్యటించి ప్రజల ఇబ్బందులను పరిష్కరిస్తున్న వైకాపా నాయకులు

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** 41 డివిజన్ లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అదేశాల మేరకు వైకాపా నాయకులు గోడి వెంకట్ ప్రతి రోజూ పలు వీధుల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. డివిజన్‌లో మురికి కాలువలు శుభ్రం చేయడం లేదు అని గమనించి, ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని శనివారం మధ్యాహ్నాం సచివాలయం B.కమలాదేవి వీధి లోమురికి కాలువలో సిల్ట్ తొలగించే చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో స్థానికులు, మున్సిపల్ శానిటేషన్ మేస్త్రి నళిని, సిబ్బంది పాల్గొన్నారు.









VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776